ప్రజాశక్తి

శనివారం 11 మార్చి 2023   8 పేజీలు

ఎన్‌టిఆర్   కృష్ణా

నూతన ఆలోచనలను స్వాగతిద్దాం : వాసిరెడ్డి పద్మ

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల బలోపేతానికి, మార్కెట్ పోటీని తట్టుకునే విధంగా నూతన ఆలోచనలను స్వాగతిద్దామని మహిళా కమిషన్ చైర్పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. జాతీయ మహిళా కమిషన్, ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సంయుక్తంగా శుక్రవారం ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు నిర్వహించారు. గొల్లపూడిలోని జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ సదస్సులో వాసిరెడ్డి పద్మ, మహిళా కమిషన్ సభ్యులు గడ్డం ఉమా, రోఖియా బేగం, వినీత పాల్గొన్నారు. తొలుత పద్మ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో జరగని విధంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుండేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళల జీవితాల్లో మార్పుకు అమ్మ ఒడి, వైఎస్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, జీరో వడ్డీ పథకం తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. మహిళల పేరున ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు ఇస్తోందన్నారు. యజమాని అంటే మహిళ అనేది సమాజానికి అలవాటు చేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో మహిళ కమిషన్ సెక్రటరీ శైలజా, రైతు సాధికార సంస్థ అధికారి అరుణ, మెప్మా, జిల్లా గ్రామీణ సంస్థ అధికారులు, గుంటూరు, కష్ణ, ఎన్టీఆర్ జిల్లా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఉత్పత్తులను పరిశీలిస్తున్న వాసిరెడ్డి పద్మ

కిడ్నీవ్యాధికి మరొకరు బలి

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామం పెద్ద తండాలోని స్వగృహంలో గురువారం అర్ధరాత్రి కిడ్నీ వ్యాధికి బానోతు బాల్య (57) అనే గిరిజనుడు బలయ్యాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన 18 ఏళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.8 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోయింది. బాల్య కుటుంబాన్ని శుక్రవారం సిపిఎం నాయకులు ఆళ్ల అమ్మిరెడ్డి, పానెం ఆనందరావు, జెట్టి వెంకటేశ్వరావు పరామర్శి:చారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విజయవాడలో ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నేత సిహెచ్.బాబూరావు; మచిలీపట్నం ధర్నాలో మాట్లాడుతున్న కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

సిపిఎస్ రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం

సిపిఎం, సిపిఐ నేతల హెచ్చరిక **ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆందోళనలకు పూర్తి సంఘీభావం**

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం, సిపిఐ నాయకులు హెచ్చరించారు. విజయవాడ, మచిలీపట్నం ధర్నా చౌక్‌లలో ఆయా పార్టీల ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా నిర్వహించారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, సకాలంలో వేతనాలు, బకాయిలు చెల్లించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలని నినాదాలు చేశారు. విజయవాడలో జరిగిన ధర్నాలో సిపిఎం, సిపిఐ శ్రేణులతోపాటు ఆర్టీసీ, మున్సిపల్, బిఎస్ఎన్ఎల్ తదితర రంగాల విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనరు, ఉద్యోగ, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు. మచిలీపట్నం ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం కృష్ణా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర జెఎసి పిలుపుమేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను సిపిఎం, సిపిఐ నేతలు కలిసి సంఘీభావం తెలిపారు. వారి ఆందోళనలకు పూర్తి మద్దతు తెలిపారు.

విజయవాడలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈశ్వరయ్య, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, మచిలీపట్నంలో జరిగిన ధర్నాలో సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, సిపిఐ జిల్లా నాయకులు ఎన్.తాతారావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోరుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు వివిధ రూపాల్లో చేస్తున్న పోరాటాలకు పూర్తి సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి నమ్మకద్రోహం చేసిందని విమర్శించారు. వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని, ఆరు నెలల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విస్మరించారన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నేతలు ఆర్.రవీంద్ర, కె.శ్రీదేవి, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, బోయి సత్యబాబు, కె దుర్గారావు, నక్కా వీరభద్రరావు, (మిగతా 6లో)

నీటి మీటర్లపై రచ్చ

ఎరక్కపోయి ఇరుక్కున్న వైసిపి **విష్ణు, మేయర్ రాజీనామా చేయాలని డిమాండ్**

ఎంఎల్‌ఎ సవాల్ నిరూపణకు సిద్ధపడుతున్న సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు

మధురానగర్ పసుపుతోటలో ఏర్పాటు చేసిన నీటి మీటరును ఈ ఏడాది జనవరి 28న పరిశీలిస్తున్న సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు (పాతచిత్రం)

ప్రజాశక్తి - విజయవాడ : "ఎరక్కపోయి...ఇరుకున్న చందంగా'...తాను తీసుకున్న గోతిలో తానే పడిన పరిస్థితి అధికార వైసిపికి ఎదురైంది. విజయవాడ నగరంలో నీటి మీటర్లు పెట్టినట్లు నిరూపించలేకపోతే కార్పొరేటర్ పదవికి రాజీనామా చేస్తావా అంటూ సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబుపై గురువారం జరిగిన వియవాడ నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశంలో అధికార వైసిపి సెంట్రల్ నియోజకవర్గ ఎంఎల్‌ఎ మల్లాది విష్ణు సవాల్ విసిరారు. దీనిపై సత్యబాబు కూడా అదేస్థాయిలో మాట్లాడుతూ..."రండి...నిరూపిస్తా, మధురానగర్లో నేను స్వయంగా నీటి మీటర్ల ఏర్పాటును పరిశీలించాను" అంటూ ప్రతిసవాల్ విసిరారు. ప్రజలకు భారంగా తయారైన నీటి మీటర్లు వద్దని అక్కడి ప్రజలు ఎదురు తిరిగితే...తాత్కాలికంగా వాటి ఏర్పాటు ప్రక్రియను విఎంసి అధికారులు వాయిదా వేసుకున్నారని సత్యబాబు గుర్తుచేశారు. కౌన్సిల్ అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కూడా సత్యబాబు ఇదే అంశంపై ఎంఎల్‌ఎ విష్ణుకు, మేయర్ భాగ్యలక్ష్మికి సవాల్ విసిరారు. నీటి మీటర్లు బిగించినట్లు తాను నిరూపిస్తే వారిద్దరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దీనిని నిరూపించడానికి వారు ఎక్కడికి రమ్మన్నా తాను సిద్ధమేనని, వారన్న మాటలకు కట్టుబడి ఉండాలని సత్యబాబు అన్నారు. అంతేగాక స్ట్రామ్ వాటర్ డ్రైన్ల నిర్మాణానికి కేంద్రం కేటాయించిన నిధులు రూ.289 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆ నిధులను తీసుకురాలేకపోతే ఎంఎల్‌ఎ, మేయర్ రాజీనామా చేయాలని కూడా సత్యబాబు డిమాండ్ చేశారు. దీంతో నీటిమీటర్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్ల నిర్మాణ అంశాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఇటు ప్రజల్లోనూ, అటు రాజకీయపక్షాల్లో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయని చెప్పక తప్పదు.

ఈ నీటిమీటర్ల వ్యవహారాన్ని పరిశీలిస్తే... అమృత్ పథకంలో భాగంగా 24/7 పథకం అమలులో భాగంగా 2021 నుంచి ఇప్పటి వరకు 500 నీటి మీటర్లు బిగించినట్లు స్వయంగా విఎంసి రికార్డులే చెబుతున్నాయి. మధురానగర్లోని పసుపుతోట తదితర ప్రాంతాల్లో వీటిని బిగించారు. నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారమైతే ఇప్పటికే 24 వేల మీటర్లు బిగించాల్సి ఉంది. కానీ ప్రజల నుండి వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. నీటి మీటర్ల ఏర్పాటు వల్ల పడే భారంపై సిపిఎం ఆయా ప్రాంతాల ప్రజల్లో చైతన్యం కలిగించింది. విఎంసిలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షంగా ఉన్న వైసిపి నేతలు నీటి మీటర్లను వ్యతిరేకించడంతోపాటు సిపిఎంతో కలిసి ఆందోళనల్లో పాల్గొన్నారు. వైసిపికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు వీటిని అమలు చేయొద్దని ఏకంగా హైదరాబాద్ వరకు పాదయాత్ర కూడా చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం టిడిపి విధానాలనే కొనసాగించడంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

టెన్త్ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

154 పరీక్షా కేంద్రాలు **30,134 మంది విద్యార్థులు**

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఏప్రిల్ 3 నుండి 18వ తేదీ వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు ఎన్‌టిఆర్ జిల్లాలో 154 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఎస్ డిల్లీరావు తెలిపారు. జిల్లాలో మొత్తం 30,134 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై శుక్రవారం ఆయన విజయవాడలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల్లో 15,530 మంది బాలురు, 14,604 మంది బాలికలు ఉన్నారన్నారు. పరీక్షలకు హాజరయ్యే మొత్తం విద్యార్థుల్లో 27,329 మంది రెగ్యులర్, 2,805 మంది సప్లమెంటరీ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 35 పోలీస్‌స్టేషన్లను స్టోరేజ్ కేంద్రాలుగా గుర్తించామన్నారు. పరీక్షల నిర్వహణకు ఇద్దరు అదనపు డిపార్ట్‌మెంట్ అధికారులను, ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, సి కేటగిరి కేంద్రాలకు 14 మంది రూట్ ఆఫీసర్లను, అదనంగా మరో 12 మంది రూట్ ఆఫీసర్లను ఎ, బి కేంద్రాలకు నియమించామన్నారు. 12 అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 1,354 ఇన్విజిలేటర్లను నియమించామన్నారు.

19 నుండి స్పాట్ వాల్యుయేషన్

ఏప్రిల్ 19 నుండి 26వ తేదీ వరకు స్పాట్ వాల్యుయేషన్ నిర్వహణకు బిషప్ అజరయ్య పాఠశాలను గుర్తించామని కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. పరీక్షల కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు 100 మీటర్ల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లుగా డిప్యూటీ తహశీల్దార్లను నియమించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారికి సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటుతోపాటు స్పాట్ వాల్యుయేషన్ జరిగే బిషప్ అజరయ్య పాఠశాల వద్ద 24 గంటలు ఆర్మ్డ్ గార్డ్స్‌తో పహారాకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నాపత్రాలను పరీక్ష కేంద్రాలకు చేరవేసేందుకు 12 క్లోజ్‌డ్ కంటైనర్ వాహనాలను సిద్ధం చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలతోపాటు రాత్రి వేళల్లో విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా సమయాల్లో అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని, హాల్‌టికెట్ కలిగిన విద్యార్థులు ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ప్రాథమిక చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లను, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించొద్దన్నారు. డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, డిఇవో సివి రేణుక, డిటిసి పురేంద్ర, విఎంసి అడిషినల్ కమిషనర్ శ్యామల, ఆర్‌టిసి డిపో మేనేజర్ ఎ.వెంకటేశ్వరరావు, విద్యుత్ శాఖ ఇఇ యు.హనుమంతరావు పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులు అందుకుంటున్న నాయకులు

కాంగ్రెస్ ఎన్టీఆర్ జిల్లా నేతల నియామకం

ప్రజాశక్తి-నందిగామ : కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులుగా కర్ల.శ్యామ్ కుమార్ (పొక్కునూరు), పెసరమల్లి శ్యామ్ బాబు(రాఘవాపురం)లను నియమిస్తూ ఎన్.టి.ఆర్.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొర్రా కిరణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అమోదంతో వీరిరువురిని నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. డీసీసీ అధ్యక్షులు బొర్రా కిరణ్ మాట్లాడుతూ నందిగామ నియోజక వర్గంలో స్థానిక నాయకులను సమన్వయం చేసుకొని పార్టీని బలో పేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అక్కల ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ మంద వజ్రయ్య, కనకపుడి వెంకటేశ్వరరావు, వేల్పుల శివకృష్ణ పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి - తిరువూరు : తెలుగుదేశం పార్టీ కార్యకర్త, మాజీ ఎంపిటిసి పసుపులేటి నరేష్ మిత్ర, న్యాయవాది లింగనేని సుధాకర్‌తో పాటు రామిశెట్టి జగన్ తదితరులు జనసేన పార్టీలో చేరారు. జనసేన పా ర్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో శుక్రవారం అపార్టీ తీర్థంపు చ్చుకున్నారు. వారికి మనోహర్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

చండీయాగం బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అజిత్‌సింగ్‌నగర్ : రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుని శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠం సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏప్రిల్ 27 నుంచి మే 3 వరకు శివశక్తి నగర్లోని పీఠంలో జరిగే సహస్ర చండీ యాగానికి విచ్చేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మల్లాది విష్ణుని దుశ్శాలువతో ఘనంగా సత్కరించి కరుమారి అమ్మన్ జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా సహస్ర చండీ యాగ పూర్వక మహా కుంభాభిషేక బ్రోచర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో శక్తి పీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కరుమారి దాసు, అమ్మవారి ట్రస్ట్ కోశాధికారి జ్ఞానేశ్వర్, నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి యేమినేని వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకులు

ప్రజాశక్తి-నందిగామ : నందిగామలోని రైతుబజారులో మహిళ రైతులు, డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయురాలు ఆర్. రాజ్య లక్ష్మీ , రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ రావెళ్ల అజయ్ కుమార్ పాల్గొని మహిళ దినోత్సవ సందేశ మిచ్చారు. ఈ సందర్భంగా మహిళా రైతులు రాజ్యలక్ష్మి ను సన్మానించారు. అనంతరం రైతులు, డ్వాక్రా మహిళలతో కేకు ను కట్ చేసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా రైతులు, డ్వాక్రా మహిళలతో పాటుగా వినియోగదారులు రైతు బజార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'జయ సిద్ధార్థ' హైస్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ జయ సిద్ధార్థ హై స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జయ సిద్ధార్థ హై స్కూల్ కరస్పాండెంట్ పి. రాంమ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. విద్యతో పాటు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో వుండాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ పి. విజయలక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చదువును ఒత్తిడితో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. చదువుతోనే ఏదైనా సాధించగలమని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

5న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

తిరువూరులో మాట్లాడుతున్న నాయకులు

నందిగామలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరువూరు : దేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు, అధిక ధరలు, ప్రయివేటీక రణ, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకా లు, తదితర అంశాలపై దేశ ప్రజలను ఐక్యం చేస్తూ ఏప్రిల్ 5వ తేదీన నిర్వ హించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గువ్వల సీతారామిరెడ్డి పిలుపునిచ్చారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సిఐటియు, రైతు, కౌలు రైతుసంఘాలు, వ్యవసాయ కా ర్మిక సంఘం ఆధ్వర్యంలో ఐక్య సద స్సు కౌలు రైతుసంఘం మండల కార్య దర్శి ఎం. ప్రభాకరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక, కర్షక హక్కులు సాధించుకునేందుకు ఛలో ఢిల్లీ ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 అమలు చేయాలని, రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని, ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించాలని, స్కీంవ ర్కర్లకు గ్రాటివిటీ ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని, నిత్యవసర సరుకులపై జిఎస్టి ఎత్తివేసి ధరల ని యంత్రణ చట్టం తీసుకురావాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయా లని, ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వమే సమర్థవంతంగా నడపాలని తదితర డిమాండ్లపై ఛలో ఢిల్లీ నిర్వ హిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యద ర్శులు మరకాల ఇశ్రాయేలు, బలగాని వెంకటేశ్వరావు, రైతుసంఘం మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు, రైతుసంఘం నాయకులు నీలపాల వలరాజు, ప్రకాశరావు తిరువూరు అంగన్వాడి ప్రాజెక్టు కార్యదర్శి నాగ మణి, కష్ణకుమారి, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం. బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్ ,డీజిల్ ,గ్యాస్, ధరలు, పన్నులు తగ్గించాలని ఏప్రిల్ 5 ఛలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాలను పంపిణీ చేశారు. నందిగామ పట్టణంలోని రాఘవపురం, కమ్మవారిపాలెం, పల్లగిరి, గోళ్ళమూడి, రుద్రవరం, ఆటో వర్కర్స్ జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కే గోపాల్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, యం.వి. యాక్టు సవరణ చట్టం రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అధ్యక్షులు కే సునీల్, కార్యదర్శి రవి, ఏసోబు,ఏసుపాదం షడ్రక్.కార్మికులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం సావిత్రిబాయి పూలే

వన్‌టౌన్‌లో నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

ప్రజాశక్తి-వన్‌టౌన్ : ప్రముఖ సంఘ సంస్కర్త, ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎపి పిటిడి బిసి అధ్యక్షులు ఎస్పీ శేషగిరిరావు అన్నారు. భవానీపురం సంఘ కార్యాలయంలో ఎపి పిటిడి బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పీ శేషగిరిరావు ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాదాల తిరుపతిరావు, ఎస్పీ యశధ, కె.పార్వతి, డి.రాజేశ్వరి, ఎన్.చెంచులక్ష్మి, ఎఓ.నాగమణి, టి.పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట :** ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన చైతన్య మూర్తి సావిత్రిబాయి పూలే అని యువ నాయకులు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు తెలిపారు. శుక్రవారం సావిత్రి భాయ్ పూలే వర్ధంతి సందర్భంగా జగ్గయ్యపేట పట్టణం కమల థియేటర్ సమీపంలో గల ఆమె విగ్రహానికి సామినేని వెంకట కృష్ణ ప్రసాద్ బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని, వాణిజ్య విభాగం అధ్యక్షులు చారుగుండ్ల కొండ, కౌన్సిలర్ వట్టేం మనోహర్, కో ఆప్షన్ ఖాదర్ బాబు పాల్గొన్నారు. అలాగే పట్టణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూమాటి కృష్ణ, ఉద్దంటి వాసు, దేవరకొండ శ్రీను, పచ్చిపాల నాగేశ్వరావు, రాజా రామకష్ణ, వర్మ, నరసయ్య పాల్గొన్నారు. అలాగే స్థానిక టిడిపి కార్యాలయంలో ఆధ్వర్యంలో నిర్వహించిన కమల సెంటర్ వద్దనున్న సావిత్రిబాయి పూలే విగ్రహానికి తెదేపా శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకష్ణ, షేక్ సత్తార్, కన్నెబోయిన రామలక్ష్మి, కర్రి చిన్న, ఇర్రి నరసింహారావు, మారేపల్లి శౌరి పాల్గొన్నారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట పట్టణం మున్సిపల్ లో పనిచేస్తున్న ఏడుగురు మహిళా కార్మికులను ఎంపిక చేసి వారికి దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి గోనెల పద్మావతి, జోనల్ వైస్ చైర్మన్ వల్లాపురపు వెంకట బాబు, జగ్గయ్యపేట మండల చైర్మన్ గోనెల శ్రీనివాసరావు, జగ్గయ్యపేట మండల బీసీ సెల్ చైర్మన్ జిడుగు శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రతినిధి దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ మండలంలో విద్యుత్ వినియోగదారులపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు చేశారు. 43 బందాలుగా ఏర్పడి 2947 సర్వీసులు తనిఖీలు నిర్వహించగా..అనుమతి లేకుండా అదనపు లోడుతో విద్యుత్ వినియోగిస్తున్న 299 మంది వినియోగదారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విజిలెన్స్ అధికారులు అపరాధ రుసుము కింద తొమ్మిది లక్షల రూపాయలను విద్యుత్ చౌర్య వినియోగదారులపై జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని ట్రాన్స్ కో డి ఇఇ శ్రీనివాసరావు, ఎడి రమేష్ కుమార్ హెచ్చరించారు.

ఎన్‌టిటిపిఎస్‌లో జాతీయ భద్రతా పక్షోత్సవాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : 45వ జాతీయ భద్రతా పక్షోత్సావాల సందర్భంగా డాక్టర్ నార్లతాతారావు తాప విద్యుత్ కేంద్రంలోని సేవాభవన్‌లోని 3వ అంతస్థులోని సమావేశ మందిరంలో 'పారిశ్రామిక భద్రత ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణలో ఉద్యోగుల పాత్ర' అనే అంశంపై సెమినార్ కార్యక్రమాన్ని ఉప కర్మాగారాల తనిఖీ అధికారి కె శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులకు వ్యాసరచన, చిత్రలేఖనం భద్రత అంశాలపై పోటీలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కర్మాగారాల మేనేజర్ సుబ్రహ్మణ్యం, ఇంజనీర్లు టివి భాస్కరరావు, వాసుదేవరావు, జవహర్ కృష్ణారావు, సురేష్‌బాబు, టి సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 45 మంది ఎంపిక

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : నిమ్రా ఫార్మసీ కళాశాలలో శుక్రవారం డివిస్ లేబరేటరీస్ క్యాంపస్ సెలక్షన్లు నిర్వహించారు. ఈ క్యాంపస్ సెలక్షన్లలో నిమ్రా విద్యార్థులతో పాటు బయట కళాశాల విద్యార్థులు సుమారు 150 మందికి పైగా పాల్గొన్నారు. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్ లాంటి వివిధ విభాగాలలో ఇంటర్వ్యూ నిర్వహించారు. దివిస్ లాబరేటరీస్ హెచ్ ఆర్ మేనేజర్ కె రాజేష్ అనంతరం 45 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జనార్ధన్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను నిమ్రా విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినేని నారాయణమూర్తి సిబ్బంది అభినందించారు.

కన్నుల పండువగా దివ్య ప్రభోత్సవం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరునాళ్ళు ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం రాత్రి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దివ్య ప్రభోభోత్సవం కన్నుల పండువగా సాగింది. ముందుగా ఆలయంలోని శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తులను బయటకు తీసుకు వచ్చి వివిధ రకాల గజ పూలమాలలుతో, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించిన దేశంలోనే అత్యంత ఎత్తైన ప్రభ పైకి అమ్మవారిని, స్వామి వారిని వుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాలివాహనులు, రజకులు వివిధ రకాల క్రతువులు, కుంభం నిర్వహించి తదుపరి ఆలయ చైర్మన్ చెన్న కేశవ రావు, కార్యనిర్వహణాధికారి లీలా కుమార్‌లు కొబ్బరి కాయలు కొట్టి దివ్య ప్రభోభోత్సవంను ప్రారంభించారు. గ్రామానికి చెందిన రైతులు ఎడ్ల జత ను ప్రభకు కట్టి ఆలయ చుట్టూ ప్రభోభోత్సవం కొనసాగింది. ఈసందర్భంగా మేళా తాళాలతో సన్నాయి డబ్బుకులు తీన్‌మార్ కోలాటం నత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డీసీపీ మేరీ ప్రశాంతి, ఎసిపి నాగేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో సీఐ నాగ మురళి ఎస్ఐ హరి పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. శుక్రవారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలు నుండి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కు బడులు తీర్చుకున్నారు.

అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

నూనె, గ్యాస్, ఇతర ఖర్చులు ఇవ్వాలి

- మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మక్క

ప్రజాశక్తి-గన్నవరం

మధ్యాహ్న భోజన పథకంలో రాగి జావా కాయడానికి, శనగలు ఉడక బెట్టడానికి అవసరమైన ఖర్చులు ఇవ్వడంతో పాటు నూనె, గ్యాస్ సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మక్క కోరారు. శుక్రవారం గన్నవరంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం రుచి పెట్టాలని చెబుతున్న ప్రభుత్వం దానిలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూలో మార్పులు చేయడం వలన మధ్యాహ్న భోజనం వండి పెట్టడం కష్టంగా మారుతుందన్నారు. రాగి జావా కాయడానికి, శనగల ఉడకబెట్టేందుకు, తిరగమోత వేసేందుకు నూనె తోపాటు గ్యాస్ అదనంగా ఖర్చు అవుతుందన్నారు. ఈ ఖర్చులను ప్రభుత్వం ఇస్తామని చెప్పిందని తర్వాత ఇవ్వడం మర్చిపోయిందని చెప్పారు. చక్ర పొంగలి తయారీకి రెండు కేజీల నెయ్యి వరకు వినియోగించాలని చెప్పడం వల్ల ఖర్చు విపరీతంగా పెరిగిపోయి వంట ఏజెన్సీలు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ వేతనం సక్రమంగా రావడం లేదని చెప్పారు. ఎన్నో ఆశలతో వంట ఏజెన్సీ బాధ్యతలను నిర్వహిస్తున్న మహిళా కార్మికులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ సమస్యలపై జిల్లా రాష్ట్రస్థాయి అధికారులకు వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు లలిత కుమారి, రూత్ కుమారి, పాడు రంగమ్మ, సుందరమ్మ పాల్గొన్నారు.

జ్వరాలు, వడదెబ్బలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో వైరల్ ఫీవర్స్, వడ దెబ్బ తదితర ప్రజారోగ్య అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెయస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇన్ఫ్లుయంజా వైరస్, వడదెబ్బ తీవ్రతపై కేంద్ర ప్రభుత్వ ఇచ్చిన సూచనల మేరకు అన్ని జిల్లాలలో అప్రమత్తంగా ఉండాలని సిఎస్ సూచించారు. తక్షణం వారం రోజులపాటు ఫీవర్ సర్వే చేపట్టాలని ఈ సందర్భంగా సిఎస్ సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా సమాధానమిస్తూ కృష్ణాజిల్లాలో ఈనెల 14న నిర్వహించనున్న డీ వార్మింగ్ డే (జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం) ను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితాసింగ్, డిఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి, డిఇఓ తాహెరా సుల్తానా, డిఆర్‌డిఎ పిడి పి.ఎస్. ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ సత్యనారాయణ రాజు, వ్యవసాయ శాఖ అధికారి మనోహర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : కోవిడ్ తరహాలో హెచ్3ఎన్2 వైరస్ ద్వారా ప్రజలు అనేక రకాలైన ఇబ్బందులు పడుతుంటే పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారని జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ మాజీ చైర్మన్, తలారి సోమశేఖర రావు, మాజీ డైరెక్టర్లు, అంగర తులసీదాస్, అబ్దుల్ అజీమ్, తెలుగుదేశం పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ ప్రచార కార్యదర్శి, పి.వి. ఫణి కుమార్ విమర్శించారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొవిడ్ తరహాలో హెచ్ 3 ఎన్ 2 వైరస్ తో ప్రజలు భయభ్రాంతులకు గురవుతుంటే నేటి వైసీపీ పాలకులు ప్రభుత్వ హాస్పిటల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. విష జ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్ళు నొప్పులు, శ్వాసకోశ సమస్యలు, వికారం, వాంతులు, గొంతు నొప్పి,

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

విరోచనాలు ఒంటి లక్షణాలతో కొన్ని వారాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న పాలకులు ఎంత మాత్రం పట్టించుకోకపోవడం చూస్తే ప్రజల ఆరోగ్యం పై వైసీపీ పాలకులకు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల పాలకులు ఇప్పటికైనా శ్రద్ధ చూపి హెచ్ 3 ఎన్ 2 వైరస్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆసుపత్రులలో రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

14 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గన్నవరం (ఉంగుటూరు) : స్వర్ణభారత్ ట్రస్ట్ ఆత్కూరు ఆధ్వర్యంలో ఉచిత హోటల్ మేనేజ్‌మెంట్ శిక్షణ తరగతులు ఈనెల 14 నుంచి ప్రారంభమవుతున్నట్లు ట్రస్ట్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ పరదేశి తెలియజేశారు. 2 నెలల శిక్షణా కాలంలో ప్రతీ రోజు ప్రాక్టికల్ శిక్షణతో పాటుగా చివరి 10 రోజులు స్టార్ హోటల్లలో ట్రైనింగ్ ఇస్తారన్నారు. పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ లేదా ఏదేని గ్రాడ్యుయేషన్ వరకు చదివి 18-35సంవత్సరాల మధ్య వయసు గల యువతీ, యువకులు ఈ శిక్షణా తరగతులకు అర్హులన్నారు. ఉచిత శిక్షణతో పాటుగా వసతి మరియు భోజనం ఉచితంగా అందిస్తామని, శిక్షణ అనంతరము ధృవపత్రం, శిక్షణలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రముఖ హోటల్లలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఆసక్తిగల అభ్యర్థులు 3 పిపి ఫొటోలు, ఆధార్ కాపీ, మార్క్స్ మెమొరాండం, ఫ్యామిలీ ఇన్‌కాం కాపీలతో ట్రస్ట్ ఆఫీస్ వద్దకు వచ్చి అప్లికేషన్ ఇవ్వాలని చెప్పారు. ఇతర వివరాలకు 93479 56659, 9032222852 నంబర్లను సంప్రదించాలన్నారు.

దేవాలయానికి సేఫ్టీ లాకరు బహూకరణ

ప్రజాశక్తి - మొవ్వ : కూచిపూడిలో వేంచేసియున్న శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి అగ్రహారానికి చెందిన భాగవతుల సంపూర్ణ మహాలక్ష్మి సేఫ్ లాకర్‌ను శుక్రవారం బహూకరించారు. ఆమె తన భర్త వేంకటా చలపతి శాస్త్రి, అత్తమామలు భాగవతుల రామలింగ శాస్త్రి, రామలక్ష్మి ల జ్ఞాపకార్థం దేవాలయంలోని దేవేరుల బంగారు ఆభరణాలు భద్రపరచుకోవడానికి ఈ సేఫ్టీ లాకరును అందచేశారు. పూజాకార్యక్రమాల అనంతరం దేవాలయ పాలక మండలి సభ్యులు, అర్చకులు సేఫ్టీ లాకర్ ను భద్రపరిచారు.

కూచిపూడిలో 'జన ఔషధి దివస్'

ప్రజాశక్తి - మొవ్వ : ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రజలకు సేవలందించాలని కూచిపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఇ.భవానీ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్ లో గ్రామ కార్యదర్శి ఇ.భవానీ అధ్యక్షతన జన ఔషధి దివస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో అందిస్తున్న వైద్య సేవలు, మందుల పంపిణీ, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు అవసరమైన వారికి వైద్య, రక్తపరీక్షల నిర్వహణ తదితర అంశాలపై ఆరోగ్య సిబ్బందితో సమీక్ష చేశారు. సిహెచ్ ఓ కె.దివ్య క్షేత్రస్థాయిలో అందిస్తున్న ఆరోగ్య సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆర్.నాగేంద్రరావు, ఎంపిహెచ్ఎ కె.రామాంజనేయులు ,ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని లక్ష్మీపురం పంచాయతీ శివారు రామానగరంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మురా కాలికి తీవ్ర గాయాలయ్యాయి. మచిలీపట్నం నుంచి చల్లపల్లి వస్తున్న ఆర్టీసీ బస్సు రామానగరం దళితవాడ వద్ద ప్రయాణికులను దింపేందుకు సడెన్ బ్రేక్ వేయగా వెనుకనే ఉన్న ట్రక్కు ఆటో బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న మురా కార్మికుడికి గాయాలయ్యాయి. హుటాహుటిన అతడిని చల్లపల్లిలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. బస్సు వెనక్కు రావటంతో ప్రమాదం జరిగిందని మురా కార్మికులు వాపోయారు.

పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా నోటీసు బోర్డులో ఉంచుతున్న ఎంపీడీవో విమాదేవి

ఓటర్ల తుది జాబితా విడుదల

ప్రజాశక్తి-ఉయ్యూరు : మండల పరిధిలో జడ్పీటీసీ ఉపఎన్నికకు సంబంధించి ఓటర్ల, పోలింగ్ కేంద్రాల తుది జాబితా ఎంపీడీవో విమాదేవి శుక్రవారం విడుదలచేశారు. 11 గ్రామాల పరిధిలో 29,189 మంది ఓటర్లుకాగా అందులో 14,093 మంది పురుషులు, 15,096 మంది మ హిళలు ఉన్నారు. 33 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, జడ్పీటీసీ, గండిగుంట 10వ వార్డు సభ్యుడితో పాటు, పెదఓగిరాల, ఆకునూరు ఉపసర్పంచ్ ఎన్నిక జరుగుతాయని తెలిపారు.

నులిపురుగుల మాత్రల పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఈనెల 14న ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని 2 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి నులిపురుగుల మందు బిళ్లలు వేయాలని ఎంపీడీ వో విమాదేవి అన్నారు. మండలపరిధిలో కాటూరు, చినఓగిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు ఉయ్యూరు అర్బన్ హెల్త్ క్లినిక్ వైద్య, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించి నులిపురుగుల మందు అందజేశారు. అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 2 నుండి 19 సంవత్సరాల లోపు వయస్సు వారికి మందులు ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులు జి.దీప, అనిల్ రాకేష్, ఎన్.తేజస్విని పాల్గొని పలు సూచనలు చేశారు.

ప్రజాశక్తి-ఉంగుటూరు(గన్నవరం) : పిల్లలకు విధిగా నులిపురుగు మాత్రలు వేయించాలని ఉంగుటూరు ఎంపీపీ సరోజిని అన్నారు. జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉంగుటూరు మండల పరిషత్ అధ్యక్షులు వి.సరోజినీ అధ్యక్షతన మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ , మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్, సి.ఆర్.పి లతో సమావేశం ఉంగుటూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలములోని అన్ని పాఠశాలలో చదువుతున్న బాల బాలికల్లో నులిపురుగు లేకుండా చేయడానికి మాత్రలు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పరిషత్ అభివృద్ధి అధికారి జి.ఎస్.వి శేషగిరిరావు, యుపిఆర్‌డి ఎం.అమీర్ బాష పాల్గొన్నారు.

మమతల పందిరి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గన్నవరం(హనుమాన్ జంక్షన్) : మమతల పందిరి ద్వారా వివిధ గ్రామాల్లో అవసరమైన వారికి అందిస్తున్న సేవలు అభినందనీయమని తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి తపన చౌదరి అన్నారు. వేడుకలు చేసే దాతలు అందించే భోజనాలను అవసరమైన వారికి అన్నదాన వితరణకు అవసరమైన మొబైల్ వ్యాన్ కొనుగోలుకు తన వంతు సహకారంగా లక్ష రూపాయల చెక్కును మమతల పందిరి గ్రూప్ అడ్మిన్ లంకరమేష్‌కు అందజేశారు. చిన్నారుల నుండి వద్ధుల వరకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడే విధంగా ఈ వాహనం తయారుచేసి అన్నదానం చేయాలని ఆలోచన మంచిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కడియాల విజయలక్ష్మి, యనమదల రమేష్, శాంతి బొర్ర, కుమార్ పెరుమాళ్ళ, వడ్డీ వాసవి , సుంకరవిజయలక్ష్మి,సునీత మాధల,కొల్లి రమ్య, కూచిపూడి అజిత్ తదితర మమతల పందిరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలను చేరొచ్చు : సిఐ

ప్రజాశక్తి-చల్లపల్లి : విద్యార్థిని, విద్యార్థులు విద్యా విషయక పాఠ్యాంశాలతో పాటు జీవితంలో ఏమైనా సాధించాలనే పట్టుదలతో నిర్దేశించుకున్న లక్ష్యమే వారిని ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని చల్లపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.బి.రవికుమార్ సూచించారు. ఈనెల 15వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని చల్లపల్లిలోని విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ రవికుమార్ మాట్లాడుతూ అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యాంశాలు ముందుగానే పూర్తిగా చదువుకుని పరీక్షలకు సిద్ధమైతే ఎలాంటి భయాలు, ఫోబియాలు దరిచేరవన్నారు. ఆందోళన వీడి మానసికంగా ప్రశాంతంగా పరీక్షలకు హాజరైతే అలాంటి వారికి విజయం దక్కుతుందని పేర్కొన్నారు. విద్యా పాఠ్య పుస్తకాలలోని జ్ఞానాన్ని సముపార్జన చేయటంతో పాటు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవలన్నారు. లక్ష్యం ఉన్నతమైనపుడు దాన్ని సాధించాలనే తపన, పట్టుదల ఉన్నపుడు ఎలాంటి బిజినెస్ స్కూల్లో చదవకపోయినా అనుకున్నది సాధించగలరని దిశా నిర్దేశం చేశారు. అందుకు ఉదాహరణగా రిలయన్స్ సామ్రాజ్యానికి పునాది వేసిన ధీరూభాయ్ అంబానీ, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఆయన సతీమణి సుధా నారాయణ మూర్తిల గురించి, విప్రో అధినేత అజీత్ ప్రేమ్జీల జీవిత గాధలను విద్యార్థులకు వివరించి వారిలో స్ఫూర్తి నింపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలంలోని వీరవల్లిలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం లంక రవీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాల నడుమ లంక వారి ప్రభ గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. చుట్టుపక్కల శుభ్రప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం నత్యాంజలి కళానికేతన చెందిన బాలబాలికలు చేసిన సంస్కృతిక ,జానపద నత్య ప్రదర్శనలు చూపురలను కట్టిపడేశాయి.

భవన నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-చల్లపల్లి : కృష్ణాజిల్లా విశ్రాంత పోలీసు అధికారుల వెల్ఫేర్ అసోసియేషన్ మచిలీపట్నం వారు నిర్మిస్తున్న భవన నిర్మాణానికి చల్లపల్లి మండలం పురిటిగడ్డ ఇండి విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డా.వేములపల్లి సురేష్ రెండు లక్షల రూపాయల సహాయాన్ని అందించారు. పురిటిగడ్డ ఐవీఎం హోమ్ లో అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.హరి రాజేంద్రబాబు, వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎల్.రాంబాబు, సభ్యులు ఎన్.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావులకు ఐవీఎం సురేష్ రూ.రెండు లక్షల చెక్ ను శుక్రవారం అందచేశారు.

కెటి రోడ్డును త్వరగా పూర్తి చేయండి

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

నెహ్రూబొమ్మ సెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి చిట్టినగర్ వరకు గల కె.టి రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ డిమాండ్ చేశారు. సిపిఎం పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నెహ్రూ బొమ్మ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.టి రోడ్డుకు రెండు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యే వెలంపల్లి మంత్రి హోదాలో శంకుస్థాపన చేసినా నేటికీ పూర్తి కాలేదన్నారు. ఎమ్మెల్యే, మేయర్ రోజూ ఈ ప్రాంతంతో తిరుగుతున్నా ప్రయాణికుల ఇబ్బందులు కనిపించకపోవడం శోచనీయమన్నారు. సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ కె.టి రోడ్డు అభివృద్ధిలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కాంట్రాక్టర్‌ను అడిగితే తమకు బిల్లులు ఇవ్వడం లేదని చెబుతున్నారని, కార్పొరేషన్ అధికారులను అడిగితే ఖజానా ఖాళీ అయిపోయిందని అంటున్నారని తెలిపారు. విజయవాడకు రావాల్సిన రూ.500 కోట్లు నిధులను ప్రభుత్వం వాడేసుకున్నట్లు కనబడుతోందన్నారు. చెత్తపై పన్ను, నీటి మీటర్లు బిగించే దానిపై ఉన్న శ్రద్ధ రోడ్ల అభివృద్ధి పనులపై పాలకులకు లేదని విమర్శించారు. ఇప్పటికైనా కె.టి రోడ్డును త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాదె బాలిరెడ్డి, ఎం.కొండారెడ్డి, కె.సూరిబాబు, ఎస్.సుబ్బారెడ్డి, ఇ.వి. నారాయణ, ఎస్.కె. బాజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, డైరెక్టర్లుగా నియమితులైన షేక్ షకీల్, హబీబుల్లాలను భవానీపురంలోని హజ్రత్ గాలిబ్ షహీద్ బాబా దర్గాలో దర్గా కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెహ్మాన్, అబ్దుల్ సత్తార్, మొహమ్మద్ అల్తాఫ్, మొహమ్మద్ ఇషాక్, నాయబ్ రసూల్, ఎండి నసీం, కార్పొరేటర్ ఎండి. ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

సహస్ర చండీయాగం బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-భవానీపురం: ఏప్రిల్ 27 నుండి మే 3 వరకు శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠం ఆధ్వర్యంలో జరగనున్న సహస్ర చండీ యాగం బ్రోచర్‌ను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీ కరుమారి దాసు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి శ్రీ దేవి కరుమారి అమ్మన్ జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ మండలం తహశీల్దార్ ఎం.మాధురి, దుర్గగుడి పాలక మండలి సభ్యులు కట్టా సత్తియ్య, అమ్మవారి ట్రస్ట్ కోశాధికారి జ్ఞానేశ్వర్, నవ్యాంధ్ర రచయితల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి యేమినేని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల తనిఖీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో రేషన్ షాపులను శుక్రవారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. రేషన్ డీలర్ పేరం వెంకటేశ్వర్లు షాపును తనిఖీ చేయగా రేషన్ బియ్యంలో వ్యత్యాసం ఉండటం వల్ల డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

అప్నాతో 'వి' భాగస్వామ్యం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ప్రముఖ టెలికామ్ ఆపరేటర్ వి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జాబ్ సెర్చ్ ప్లాట్‌ఫాం అప్నాతో భాగస్వామ్యం చేసుకున్నట్లు సంస్థ ప్రతినిధి సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రత్యేక యాప్ ద్వారా మహిళలు, టీచర్లు, టెలికాలర్లు, రిసెప్షనిస్టులు, మొదలైన ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వీటితో పాటు పార్ట్ టైమ్, వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా కూడా ఉపాధి అవకాశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

20న జిఒ 1 రద్దు కోరుతూ 'చలో అసెంబ్లీ'

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజల గొంతు నొక్కే జిఒ నెంబర్ 1 రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న నిర్వహిస్తున్న చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జీవో నెంబర్ 1 రద్దు పోరాట ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్లు సుంకర రాజేంద్రప్రసాద్, ముప్పాళ్ల సుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ జీవో రద్దు కోరుతూ పోరాట ఐక్య వేదిక అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం జీఓను ఉపసంహరించుకోకపోవడంతో పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. మార్చి 15, 16 తేదీలలో ప్రతి జిల్లాలోనూ జిల్లా స్థాయి సమావేశాలు జరిపి జీవో ఒకటిని రద్దు చేయాలని డిమాండ్ చేయాలని, అదేవిధంగా మార్చి 20వ తేదీన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించామన్నారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పి.దుర్గాంబ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంక గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అందులో భాగంగానే ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలను పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. అల్ మునీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లబ్బీపేటలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత మెడికల్ క్యాంపును వైసిపి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్య, వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రజలకు తగిన విధంగా సహకారం అందించాలన్నారు. ముఖ్యంగా అల్ మునీర్ ఫౌండేషన్ పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. అల్ మునీర్ ఫౌండేషన్ చైర్మన్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో గుండె సమస్యలతో చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరికీ గుండె వైద్యంపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య రక్షణ అందించాలనే ఉద్దేశంతో టాప్‌స్టార్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా గుండె జబ్బులు, ఎముకలు, కీళ్లకు సంబంధించిన వైద్య నిపుణులు ఉచితంగా సేవలు అందించారన్నారు. షుగర్, బిపి, ఇసిజి, 2డి ఎకో పరీక్షలు ఉచితంగా నిర్వహించారని సుమారు 400 మందికిపైగా ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కార్డియాలజిస్టు డాక్టర్ తబిష్ సయ్యద్, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ షణ్ముఖ్ తూమాటి, గైనకాలజిస్టు డాక్టర్ రజియా వైద్య సేవల్లో పాల్గొని సేవలు అందించారన్నారు.

సింగిల్ వికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: యువతకు క్రీడల పట్ల ఆసక్తి కలిగించాలనే ఉద్దేశంతో స్కోడా ఆటో ఇండియా ఆధ్వర్యంలో స్కోడా సింగిల్ వికెట్ టోర్నమెంట్ సీజన్ 2 నిర్వహిస్తున్నట్లు బ్రాండ్ డైరెక్టర్ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈటోర్నమెంట్‌లో 59 నగరాల నుండి అత్యుత్తమ క్రికెటర్లను ఎంపికచేసి పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 28వ తేదీ నుండి టోర్నమెంట్ ప్రారంభమవుతుందని తెలియచేశారు. సిటీ ట్రయల్స్, ఫైనల్స్ అన్ని విభాగాలకు ఈఏడాది ఏప్రియల్, మే నెలలో జరుగుతాయన్నారు. అండర్ -12, అండర్ -16 బాల , బాలికలకు విడి విడిగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

26న మహాలక్ష్మి యాగం

ప్రజాశక్తి-విజయవాడరూరల్: రామవరప్పాడులో వేంచేసిఉన్న శ్రీ వెంకమ్మ పేరంటాలు అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 26న పంచమి వసంత నవరాత్రుల సందర్భంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, మహాలక్ష్మి యాగం నిర్వహించనున్నట్లు ఇఒ పి.లోకేశ్వరి తెలిపారు. 108 దంపతులకు మాత్రమే అవకాశం ఉందని, పూజా రుసుము కింద రూ. 1,116 చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9000901818, 9030444681 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడరూరల్: నున్నలో రూ.14 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం జడ్పిటిసి కె.సువర్ణరాజు ప్రారంభించారు. ప్రాధాన్యత క్రమంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.సరళ, ఉప సర్పంచ్ కె.బ్రహ్మానందరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వై.నాగిరెడ్డి, భీమవరపు ముత్తారెడ్డి, ఎఇ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల పాత్ర అమోఘం : జడ్జి

ప్రజాశక్తి-మైలవరం: గ్రామీణ ప్రాంతాల్లో అంగన్వాడీలు అందిస్తున్న సేవలు అమోఘమని మైలవరం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ షీరీన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహించే మహిళా చైతన్య సదస్సులో భాగంగా శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళా చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ పుష్పలత, మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముల్లంగి రవికుమార్, బుద్ధారం వెంకటరావు పాల్గొన్నారు.

12న జీ తెలుగులో ప్రత్యేక సంగీత కార్యక్రమం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: సంగీత ప్రదర్శనలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు సరిగమప ఛాంపియన్ షిప్‌లో ఈ నెల 12వ తేదీన జరిగే కార్యక్రమంలో ఎఆర్ రెహామాన్ పాటల కార్యక్రమం ప్రసారమవుతుందని జీ తెలుగు ప్రతినిధి రాజేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి తొమ్మిది గంటలకు ప్రసారమయ్యే కార్యక్రమం ఎఆర్ రెహామాన్ స్వరపరచిన పాటలతో ప్రేక్షకులను అలరించనుందన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

విజయవాడ రూరల్ వ్యవసాయ సలహా మండలి సమావేశం తీర్మానం

ప్రజాశక్తి-విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో 1,020 హెక్టార్లలో రైతులు జొన్నను సాగు చేస్తున్న నేపథ్యంలో మండలంలో ప్రత్యేకంగా జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం తీర్మానించించింది. నున్న రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ యర్నారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. నున్న, పి నైనవరం, అంబాపురం, నిడమానూరు, గూడవల్లి గ్రామాలలో రబీ సీజన్‌లో జొన్నను సాగు చేస్తున్నారని చెప్పారు. మండలంలో గతంలో పోల్చితే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగినందున, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు వ్యవసాయాధికారి బత్తిన రంగనాథ్‌బాబు తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను నిల్వ చేసుకునేందుకు ప్రత్యేకంగా గోదాము సౌకర్యం కల్పించాలని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని సమావేశం నిర్ణయించింది. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా క్లస్టర్ హైరింగ్ సెంటర్ (సిహెచ్‌సి) గ్రూపుల ద్వారా మాత్రమే కాకుండా వ్యక్తిగతంగా పనిముట్లు ఇవ్వాలని గ్రామ వ్యవసాయ సలహా మండళ్ల చైర్మన్లు ప్రతిపాదించగా, ఆ దిశగా చర్యలు చేపడతామని ఎఓ తెలిపారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి సభ్యుడు కె సువర్ణరాజు, నున్న సర్పంచ్ కె సరళ, ఎనికెపాడు కమిటీ చైర్మన్ మట్టా ప్రభాకర్, మండల కమిటీ సభ్యులు కె కోటేశ్వరరావు, డి రాజశేఖర్, పి పరమేష్‌రెడ్డి, ఎస్ రాఘవేంద్రరావు, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి వెంకటేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ కె ప్రసన్నలక్ష్మి, నున్న సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందుల తయారీరంగంలో మెరుగైన ఉపాధి

కెఆర్‌యు ఫార్మసీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో విసి కె.రామమోహనరావు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

ప్రపంచవ్యాప్తంగా నేడున్న సమాజంలో మందుల తయారీ రంగంలో కొత్త మార్పులు, ఆవిష్కరణలు చోటుచేసుకుంటున్నందున మెరుగైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని కృష్ణా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.రామమోహనరావు అన్నారు. కృష్ణా యూనివర్సిటీ

విసి కె.రామమోహనరావును సత్కరిస్తున్న అధ్యాపకులు, ప్రొఫెసర్లు

ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విసి కె.రామమోహనరావు మాట్లాడుతూ యూనివర్సిటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటికే భారత దేశం ఫార్మసీ రంగంలో అగ్రగామిగా వెలుగొందుతోందన్నారు. మందుల పరిశ్రమల లోపభూయిష్టమైన విధానాలతో తక్కువ నాణ్యత గల మందులు తయారీ, కల్తీ మందులతో అనేక దుష్పరిణామాలు జరిగే అవకాశం ఉందన్నారు. వాటిని నిరోధించాల్సిన బాధ్యత ఫార్మసిస్టులపై ఉందన్నారు. యూనివర్సిటీ అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకొని పరిశోధనలు చేసి పేటెంట్స్ పొందాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుతో పాటు, నాయకత్వ లక్షణాలు కలిగి సత్ప్రవర్తన కలిగి డేటా స్కిల్స్‌పై అవగాహన కలిగి ఉంటే జీవితంలో ఉన్నతంగా స్థిరపడొచ్చున్నారు. ఫార్మసీ కళాశాల నూతన భవనం నిర్మాణానికి అన్ని చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే నూతన భవనంలో తరగతులు నిర్వహిస్తామన్నారు. అన్ని రకాల అత్యాధునిక పరికరాలతో కూడిన ల్యాబ్స్ నిర్మాణం కూడా సిద్ధం చేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాంబాబు మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులు జీవితంలో స్థిరపడాలంటే కేవలం సర్టిఫికెట్స్ మాత్రమే సరిపోవన్నారు. పరిశ్రమ, సమాజ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపర్చుకొని స్మార్ట్ వర్క్ విధానాలు అవలంభించాలన్నారు. తద్వారానే జీవితంలో ఉన్నతంగా స్థిరపడొచ్చున్నారు. మంచి వ్యక్తుల స్నేహం కూడా జీవితంలో ఎదుగుదలకు దోహదపడుతుందని వివరించారు. విశిష్ట అతిథిగా యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వై.కె. సుందర కృష్ణ మాట్లాడుతూ ఫార్మసీ రంగాన్ని సేవా రంగంగా అభివర్ణించారు. విద్యార్థి దశ నుంచే పరిశ్రమతో అనుసంధానం పెంపొందించుకోవడంతో పరిశ్రమ అవసరాల గురించి తెలుసుకోవచ్చునన్నారు. జనరిక్ మెడిసిన్స్‌ను ఎక్కువ సంఖ్యలో అభివృద్ధి చేస్తే తక్కువ ధరలకే మందులు అందించొచ్చునని వివరించారు. ఫార్మసీ రంగాన్ని సేవా రంగంగా భావించాలని సంపాదనే ధ్యేయంగా ఉండరాదని కోరారు. విసి కె.రామమోహనరావు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ వై.కె.సుందరకృష్ణను ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను అలరించాయి.

40 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

వెనిగండ్ల ఫౌండేషన్ అధినేత వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో 40 మందికి ఉచిత కళ్ళ ఆపరేషన్లను ఉయ్యూరు రోటరీ ఆసుపత్రిలో నిర్వహించారు. ఫిబ్రవరి 24వ తేదీన మెడికల్ క్యాంప్ నిర్వహించగా ఆ శిబిరంలో కంటి ఆపరేషన్లు అవసరమైన నిరుపేదలకు వెనిగండ్ల ఫౌండేషన్ ద్వారా ఉచిత ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వల్లభనేని వెంకటరావు, పొట్లూరి రవికుమార్, ఈడుపుగంటి ఉమామహేశ్వరరావు, మూల్పూరి సుధాకర్ , హేమంత్, రాంబాబు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఐవిఎం సురేష్ విరాళం

ప్రజాశక్తి-చల్లపల్లి

కృష్ణాజిల్లా విశ్రాంత పోలీసు అధికారుల వెల్ఫేర్ అసోసియేషన్ మచిలీపట్నం వారు నిర్మిస్తున్న భవన నిర్మాణానికి చల్లపల్లి మండలం పురిటిగడ్డ ఇండీ విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ రూ.2 లక్షల సహాయాన్ని అందించారు. పురిటిగడ్డ ఐవిఎం హోమ్‌లో అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.హరి రాజేంద్రబాబు, వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎల్.రాంబాబు, సభ్యులు ఎన్.వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావులకు ఐవిఎం సురేష్ రూ.రెండు లక్షల చెక్కును శుక్రవారం అందచేశారు.

ట్రాఫిక్ ఎఎస్ఐ భాగ్యవతికి అవార్డు

గుడివాడ : నిత్యం ప్రజలకు సేవ చేయడంతో పాటు పోలీసు విధులను నిర్వహిస్తున్న ట్రాఫిక్1 ఎఎస్ఐ భాగ్యవతికి జిల్లా ఎస్‌పి జాషువా చేతుల మీదుగా జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డును అందజేయడం అభినందనీయమని శ్రీకృష్ణ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ అన్నారు. ఎఎస్ఐ భాగ్యవతికి సేవా అవార్డు రావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఊర్ధ్వమాత మహోత్సవాలు ప్రారంభం

గుడివాడ : 130 సంవత్సరాల చరిత్ర కలిగిన వెన్ననపూడి ఊర్ధ్వమాత మహోత్సవాలు గత రెండురోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయని వెన్ననపూడి విచారణ గురువు ఫాదర్ కూచిపూడి ప్రశాంత్ తెలిపారు. శుక్రవారం అయన విలేకర్లతో మాట్లాడుతూ 130 సంవత్సరాల క్రితం వెన్ననపూడిలో ఊర్ధ్వమాతగా మరియతల్లి దర్శనం ఇచ్చారని పేర్కొన్నారు. ఏటేటా మార్చి 9,10,11 తేదీల్లో నందివాడ మండలం వెన్ననపూడిలో ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని వివరించారు. రజిత జూబిలి, గురువులు పసల థామస్, తెలాలి థామస్, పోలిశెట్టి జయరాజు, దారా బాలస్వామిలు ప్రతేకంగా దివ్యపూజాబలి సమర్పించారు. శనివారం విజయవాడ పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు అధ్వర్యంలో సమిష్టి దివ్యపూజాబలి సమర్పిస్తామని తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక వెలుగు కార్యాలయం ద్వారా మహిళలకు వివిధ ఆటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు కుంచె వెంకటేశ్వర్లు, లక్ష్మి, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో బహుమతులు పొందిన మహిళలు వీరే..

బస్సును నడుపుతున్న పేర్ని కిట్టు

నాన్ ఎసి స్లీపర్ బస్సు ప్రారంభం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మచిలీపట్టణం డిపో నుండి హైదరాబాద్ ఈసిఐఎల్ కు నూతనంగా నాన్ ఏసీ స్లీపర్ బస్సు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల వైసీపీ యువజన విభాగం అధ్యక్షులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం బస్సు స్వయంగా నడిపి ప్రారంభించారు. స్లీపర్ బస్సు ప్రతిరోజూ సాయంత్రం 9.45 గంటలకు మచిలీపట్నంలో బయలు దేరి ఉదయం హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్ ఫ్రమ్ హోం పద్ధతిలో పని చేస్తున్న సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు ఈ బస్సు సర్వీసు ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఏపిఎస్ఆర్టిసి బస్సుల వినియోగాన్ని పెంచాలని, మరింత ఆదరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలి

తహశీల్దార్‌కు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-పమిడిముక్కల

ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనసాగించటం ద్వారా రైతుల వద్ద ఇంకా మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం నాయకులు రాజులపాటి రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, గోవిందరాజు శ్రీరాములు కోరారు. మండల కేంద్రమైన పమిడిముక్కలలోని రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రాజ్యలక్ష్మిని శుక్రవారం వారు కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిలు తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐనంపూడి, లంకపల్లి, మంటాడ, తాడంకి, శ్రీరంగపురం గ్రామాల్లోని కౌలు రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులు, కౌలు రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తిచేశారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు

పనుల్లో అవకతవకలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - గుడివాడ (నందివాడ)

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు లేకుండా అధికారులు చూడాలని ప్రాజెక్ట్ డైరెక్టర్, డ్వామా, జిల్లా హౌసింగ్

అధికారి జి.వి.సూర్య నారాయణ ఆదేశించారు. నందివాడ మండల పరిధిలోని పొణుకుమాడు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా అమృతసరోవర్ క్రింద చెరువు త్రవ్వకం పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అనమనపూడి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సచివాలయాన్ని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయడానికి తగు చర్యలు తీసుకోవాలని ఎఇ రాధాకృష్ణను ఆదేశించారు. జనార్ధనపురం పరిధిలో జగనన్న హౌసింగ్ కాలనీ సందర్శించి ఇళ్ళు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా హౌసింగ్ ఎఇ జిలానిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బివై విష్ణు ప్రసాద్, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ఈసీ సుధాకర్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, సచివాలయాల సిబ్బంది, ఇంజనీరింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మీ తప్పిదాలకు ఉపాధ్యాయులను బలి చేస్తారా?

మచిలీపట్నంలో యుటిఎఫ్ నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థ గాడి తప్పుతోందని యుటిఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.కనకారావు, జె.లెనిన్‌బాబు విమర్శించారు. ఉపాధ్యాయులపై దాడులు ఆరి కట్టాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి కలెక్టరేట్ ధర్నా చౌక్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జె.లెనిన్ బాబు, బి.కనకారావు మాట్లాడుతూ కొంతమంది అధికారుల అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థ గాడితప్పుతోందన్నారు. అవగాహన లేని అధికారులు ఆకస్మిక తనిఖీల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్నారన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులంతా మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం భారిన పడుతున్నారన్నారు. సమయానికి పాఠ్య పుస్తకాలు అందించకుండా, ఉపాధ్యాయులతో బోధనేతర పనులు చేయిస్తూ విద్యా వ్యవస్థకు ప్రభుత్వం నష్టం చేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చేయించకుండా విద్య బోధన పై దష్టి సారించేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 రకాల యాప్‌లతో పనిభారం మోపి బోధనకు దూరం చేస్తూ ఆకస్మిక తనిఖీలతో ఎందుకు ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్నారో చెప్పాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.ఎ.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఒత్తిడి కారణంగా నెల రోజుల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఆరుగురు ఉపాధ్యాయులు మరణించారన్నారు. సెలవు ఉండటం లేదనీ, ఆదివారం కూడా ప్రత్యేక తరగతుల పేరుతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు నీలం ప్రభాకరరావు, జిల్లా సహాధ్యక్షురాలు జె.రూఫ్నీ, జిల్లా కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వరరావు, టి.గంగరాజు, టి.నాగేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎల్.నరేంద్ర, ఫ్యాప్టో కృష్ణాజిల్లా శాఖ చైర్మన్ బి.లంకేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు జిల్లా కోర్టులో
O.S.No. 27/2013 EP No. 100/2018
EA No. 123/2019

Between :
సయ్యద్ సాభీహన భర్త సయ్యద్ బషీర్, డోర్ నెం. 23-33, సాయిపురం కాలనీ, యల్.ఐ.సి. కాలనీ, గొల్లపూడి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, యన్‌టిఆర్‌జిల్లా ... క్లయిమ్ పిటీషనరు
మరియు
1) నీరుకట్టు సూరేష్‌నాయుడు మరియు ఇతరులు
టు
2) అబ్దుల్ సయ్యద్, తండ్రి : లేటు అబ్దుల్ మజీద్, డోర్ నెం. 29-37-143, డక్కన్ ఆఫ్ టికర్స్, వెంకటేశ్వరరావు వీధి, రామమందిరం ప్రక్కన, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002 ... 2వ రెస్పాండెంట్

పై నెంబరు ఇ.పి.లో యీ నెంబరు పిటీషనరు అనగా సయ్యద్ సాభీహనకు క్లయిము వున్నట్లు పై నెంబరు క్లయిము పిటీషను దాఖలు చేసుకొని యున్నారు. సదరు పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్‌కు / జెడిఆర్‌కు ఎట్టి అభ్యంతరములు వున్న యెడల తెలుపుకొనే నిమిత్తం ది. 14-3-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
విజయవాడ
తేది: 5-3-2023

ఇట్లు
శ్రీ దాసు త్రివిక్రమవ్యాస్
పిటీషనరు తరఫు న్యాయవాది,
గాంధీనగర్, విజయవాడ- 520003
సెల్ : 98482 07621.

IN THE COURT OF THE PRINCIPLE SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. 264/2021 In IA 354/2022

Between :
Pilla Amarnadh ... Plaintiff / Petitioner
Vs
1. Gadamsetty Sivaiah (died)
2. Gadamsetty Adilakshmi,
W/o Late Sivaiah
3. GadamsettyKumar, S/o Late Sivaiah
4. Gadamsetty Kiran Babu
S/o Late Sivaiah
... Respondents / Proposed Defendents 2 to 4

పై నెంబరు దావాలోని ప్రతివాది 26-02-2022న చనిపోయినందున వారి స్థానే 2 to 4 వారలను సదరు శివయ్యగారి వారసులుగా చేర్చి ఈ దావా గ్రంథమును జరిపించమని వాది దాఖలు చేసిన పిటీషనుపై సదరు 2 to 4 ప్రపోస్ డిఫెండెంట్స్‌కు ఏమైనా అభ్యంతరములు వున్నయెడల ది. 03-04-2023 ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై తెలుపుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానింపబడును.
విజయవాడ
తేది :10-3-2023

ఇట్లు
బీరం బాబూరావు,
అడ్వకేట్ ఫర్ ప్లెయింటిఫ్.

మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు జిల్లా కోర్టులో
O.S.No. 27/2013 EP No. 100/2018
EA No. 124/2019

Between :
సయ్యద్ బషీర్, తండ్రి : సయ్యద్ కరీమ్, డోర్ నెం. 23-33, సాయిపురం కాలనీ, యల్.ఐ.సి. కాలనీ, గొల్లపూడి గ్రామం, విజయవాడ రూరల్ మండలం, యన్‌టిఆర్‌జిల్లా ... క్లయిమ్ పిటీషనరు
మరియు
1) నీరుకట్టు సూరేష్‌నాయుడు మరియు ఇతరులు
.... రెస్పాండెంట్స్
టు
అబ్దుల్ సయ్యద్, తండ్రి : లేటు అబ్దుల్ మజీద్, డోర్ నెం. 29-37-143, డక్కన్ ఆఫ్ టికల్స్, వెంకటేశ్వరరావు వీధి, రామమందిరం ప్రక్కన, ఏలూరు రోడ్డు, విజయవాడ - 520002
... 2వ రెస్పాండెంట్ / జెడిఆర్

పై నెంబరు ఇ.పి.లో యీ నెంబరు పిటీషనరు అనగా సయ్యద్ బషీర్ క్లయిము వున్నట్లు పై నెంబరు క్లయిము పిటీషను దాఖలు చేసుకొని యున్నారు. సదరు పిటీషన్‌లో 2వ రెస్పాండెంట్‌కు / జెడిఆర్‌కు ఎట్టి అభ్యంతరములు వున్న యెడల తెలుపుకొనే నిమిత్తం ది. 14-3-2023వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
విజయవాడ
తేది: 5-3-2023

ఇట్లు
శ్రీ దాసు త్రివిక్రమవ్యాస్
పిటీషనరు తరఫు న్యాయవాది,
గాంధీనగర్, విజయవాడ- 520003
సెల్ : 98482 07621.

INTHE COURT OF HON□BLE IIIrd ADDL. JUNIOR CIVIL JUDGE VIJAYAWADA
O.S. 1934/2019

Between :
CANARA BANK, Iron Centre, Branch, Mandapati Anil Kumar, S/o Jaya Raju, Hindu, aged about 36 years, Manager, O/o One Town, Vijayawada .... Plaintiff
And
1. M/s Kanakadurga Mahila Dwakra Group A Self Help Group, rep by its Members
2. Mageti Krishna Veni
3. Anumakonda Lalitha ... Defendants
To,
D1. M/s Kanakadurga Mahila Dwakra Group, a (self help) Group, rep by its Leader, Majeti Krishnaveni, H.no. 1-1/6-63-1, Karakatta South, Kummaripalem centre, Vidhyadharapuram, Vijayawada.
D2 : Majeti Krishnaveni, Hindu, aged about years, H.no. 1-1/6-63-1, Karakatta South, Kummaripalem centre, Vidhyadharapuram, Vijayawada.
D3 : Anumakonda Lalitha, W/o Prakash, H.No. 1-1/6-63/2, Near ODA Park, Karakatta Down, Vidhyadharapuram, Vijayawada.

పై నెంబరు దావాలో డిఫెండెంట్స్ 1 to 3 హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది. 03-04-2023 తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు పై తెలిపిన తేదీన ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, మీ తరఫు న్యాయవాది గారి ద్వారా గానీ, హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల మీ ఈ దావా మీ పరోక్షమున విచారించి తీర్మానం చేయుదురని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 03-04-2023

ఇట్లు
వి.శ్రీధర్,
వాది తరఫు న్యాయవాది,
విజయవాడ. సెల్ : 9030202722.

NOTICE
IN THE COURT OF IV ADDL. JUNIOR CIVIL JUDGE : AT VIJAYAWADA
E.A. 65 OF 2022 IN O.S. NO. 82 OF 2017

Between :
Dowlat Khan S/o Allabaksh, resident of Kedareswara pet, Vijayawada
... Petitioner / Decree Holder
And
Abdul Jaleel S/o Shukkur, Muslim, Quarter No.81, Wynchipet, Railway Quarters, Vijayawada ... Respondent / JDR

Respondent - JDR take notice that in above sent for petition filed against you, you are avoiding to received notice and Hon□ble court ordered notice to you and posted to 27-03-2023 for your appearance before the Hon□ble court at 10.30 AM. appear before the Hon□ble court. Else next step follows.
// By Orders //

T.V.N. Vasudevarao,
Advocate for Petitioner / DHR

IN THE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE, VIJAYAWADA
O.S. NO. 115 OF 2022

Between :
Bharat Sanchar Nigam Limited, Rep. by it□s Assistant General Manager (Admn) .... Plaintiff
And
M/s Karvy Data Management Services Limited, Rep. by it□s Managing Director
... Defendant

To,
M/s Karvy Data Management Services Limited, Rep. by its Manaing Director, D.No. 6-82/1, Near Panchayat Office, Guntupalli - 521 241, Vijayawada J.C.J.C.

The above numbered case is posted for suit summons to the defendant by way of paper publication. The above defendant should appear before the Hon□ble Courton 03-04-2023 at 10-30 A.M. and file his written statement if, any. Else the defendant will be decided exparte, and the matter will be decided exparty.

ITHAPU SUBRAHMANYESWARA RAO,
Advocate for Plaintiff,
D.No. 23-23-46A, Sivarao Street,
Satyanarayanapuram,
Vijayawada - 520 011.
Cell : 92915 30307

సిపిఎం రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం

(మొదటి పేజీ తరువాయి) : మచిలీపట్నంలో జరిగిన ధర్నాలో సిపిఎం, సిపిఐ నాయకులు బూర సుబ్రహ్మణ్యం, లింగంఫిలిప్, ఎస్.ధనుంజయ రావు, సిహెచ్.జయరావు, పి.నాగయ్య, సిహెచ్.విజయలక్ష్మి బి.భవానీ, డి.సత్యనారాయణ, ఈడే రామారావు, ఒ.ఎల్.రావు, నాగరాజు, చండిక రాంబాబుతోపాటు ఉద్యోగ సంఘ నాయకులు ఎంవి.శ్యామ్‌నాథ్, శ్రీనివాసరావు, బేగ్, వీరభద్రరావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE XIV ADDL. DISTRICT JUDGE CUM ADDL. FAMILY JUDGE AT VIJAYAWADA
FCOP No. (GWOP) 1227/2022
In the matter of Appointment of Guardian for minor Shaik Sharif, Born on 2-4-2005.

Between :
Shaik Merabee .... Petitioner
And
Nil .... Respondents

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా షేక్ చిన చందులు తండ్రి : పెద్ద సైదులు ది. 18-3-2020 తేదీన చనిపోయినందున వారి వారసులుగా భార్యయైన మీరాబీ, మైనరు కుమారుడైన షేక్ షరీఫ్ మైనరు అయినందున గార్డియన్‌గా తల్లియైన షేక్ మీరాబీ గారిపేర, షేక్ చిన్న చందులు గార్కి రావల్సినAc.No.AP/GRGNT/33133/8, బెనిఫిట్స్ వగైరాల నిమిత్తం పై నెంబరు కోర్టులో పిటీషను దాఖలు చేయగా కోర్టువారు ది. 28-3-2023 తేదీన వాయిదా వేసినారు. ఆ రోజు ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు వున్న యెడల పై కోర్టు నందు ఉదయం 10-30 గం.లకు కోర్టు పనిచేయు సమయంలో తమ ఆక్షేపణలు తెలియజేయగలరు. లేని యెడల పరోక్ష మందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియ జేయడమైనది.
వాయిదాతేది: 28-3-2023
విజయవాడ
ది.10-3-2023

ఇట్లు
కె.మణికుమార్,
వి.వి.రాఘవయ్య,
అడ్వకేట్స్ ఫర్ పిటీషనర్స్,
విజయవాడ.

IN THE COURT OF HON□BLE IIIrd ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
I.A. NO. 310, 311/2020 IN O.S. No. 1229/2020 & O.S. No. 1229/2020

Between :
Lakshmi Towers Apartment Welfare Association, Rep. by its Secretary
...Plaintiff
And
Medasani Ratna Kumari & another
... Defendants

పై నెంబరు దావాలోని Defendants 3 & 4 అనగా
D3 : Ajay Constructions rep by Managing Partner Koritala Hanumantha Rao, S/o Sambasiva Rao, Flat No. 301, Dhana lakshmi Towers, NEar Ramanagar Kata, Tadigadapa, Penamaluru, Vijayawada.
D4 : Shaik Inthiyaz, S/o Rasheed, D.No. 9-448, Ramanagar Kata, Tadigadapa, Penamaluru, Vijayawada.

వారికీ శ్రీ కోర్టువారి ద్వారా పంపిన సమన్స్‌ను సర్వ్ కానందున, సదరు సమన్లను సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా అమలు చేయుటకు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పై నెంబరు దావాలోని ది. 16-03-2023 తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట ప్రత్యక్షంగా గానీ, లేక లాయరుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున పై నెంబరు దావాను తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 16-03-2023

ఇట్లు
బి.వి.ఎస్.ఆర్.ప్రసాద్, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్,
MIG-II Colony, Block No. 17/5,
భవానీపురం, విజయవాడ.
సెల్ : 9440174693.

గ్రామ పంచాయతీ కార్యాలయం, గండిగుంట

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. 18/2023 **ది. 10-03-2023**

కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం గండిగుంట గ్రామ పంచాయతీ నందు 2023-24 ఆర్థిక సంవత్సరమునకు అనగా ది. 01-04-2023 నుండి 31-03-2024 వరకు ఈ దిగువ షెడ్యూల్ చూపిన ప్రకారం కాంట్రాక్టు ఏజన్సీ పద్ధతిపై మంది పనివాళ్ళను సప్లయి చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు ది. 16-3-2023 తేదీ గురువారం ఉదయం 10-30 గం.ల నుండి మధ్యాహ్నం 1.00 గం.ల వరకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శి గారిచే గానీ లేదా వారి అనుమతి పొందిన వారిచేగానీ సీల్డు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 2-00 గం.లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును. టెండర్లలో పాల్గొనదలచిన వారు నిర్ణయించిన ధరావత్తు చెల్లించి పాల్గొనవచ్చును. ప్రభుత్వము వారి షరతులకు లోబడి టెండరుల దాఖలు చేయవలెను. టెండర్ల షెడ్యూల్ మరియు మిగిలిన వివరములు పంచాయతీ కార్యాలయ పనివేళలలో తెలుసుకొనవచ్చును. టెండర్లు రద్దు పరచుటకు లేదా అనుమతించుటకు పంచాయతీ కార్యదర్శికి అధికారము కలదు.

వ .నెం		పని వివరం	పనివార్ల సంఖ్య కాలపరిమితి	ధరావత్తు
1.	రోజువారి పారిశుధ్య పనులు నిర్వహణ	17+2 =19 (డ్రైవర్లు)	01.04.2023 నుండి 31.03.2024 వరకు (1 సం॥ కాలము)	రూ. 5,000/-
2.	రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణ	5		
3.	వీధిలైట్లు రిపేరు నిర్వహణ	1		
4.	పైపులైన్లు రిపేర్లు - ఫిట్టరు	1		
	మొత్తము	26 మంది		

గమనిక : 1) పైన తెలిపిన పనులే కాకుండా పంచాయతీకి సంబంధించిన అన్ని పనులు చేయుటకు పనివారు అంగీకారం తెలుపవలెను. 2) గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి పైకము చెల్లించబడును. 3) గతంలో ఈ గ్రామపంచాయతీకి సప్లయ్ చేసిన ఏజన్సీ వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. 4) టెండర్లు తిరస్కరించుటకుగాని, ఆమోదించుటకుగాని పంచాయతీ కార్యదర్శికి అధికారము కలదు. 5) సంబంధిత అధికారుల నుండి అనుమతి పొందిన తదుపరి పేమెంట్ చేయబడును. 6) పారిశుధ్య కార్మికులు రోజుకి 8 గంటలు పనిచేయవలెను.

సం// గెత్తం అనుపమ
సర్పంచ్
గ్రామ పంచాయతీ, గండిగుంట

సం // వై.రాజారావు
పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతీ, గండిగుంట

గ్రామపంచాయతీ కార్యాలయం, వల్లూరుపాలెం

తోట్లవల్లూరు మండలం, కృష్ణాజిల్లా

టెండరు ప్రకటన, **తేది: 13-03-2023**

కృష్ణాజిల్లా, తోట్లవల్లూరు మండలం, వల్లూరుపాలెం గ్రామపంచాయతీ నందు ది. 01-04-2022 నుండి 31-03-2024వ తేదీ వరకు అనగా ఒక సంవత్సర కాలమునకు ఈ దిగువ తెలిపిన సిబ్బంది సేవలను కాంట్రాక్టు లేబరు పద్ధతిపై పనిచేయుటకు 16-03-2022వ తేదీ ఉదయం 12 గంటలకు సీల్డు టెండర్లు పంచాయతీ కార్యదర్శిచేగానీ వారి అనుమతి పొందిన వారిచేగానీ స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును.

వ.నెం.	పనివివరములు 1-4-2023 నుండి 31-3-2024 వరకు		ధరావత్తు
1.	2 పిడబ్ల్యుఎస్ స్కీమ్‌ల నిర్వహణ	1 వ్యక్తి సేవలు	ఒక్కొక్కరికి రూ.1000/-
2.	వీధులు శుభ్రపరచుటకు	4 వ్యక్తుల సేవలు	ఒక్కొక్కరికి రూ.1000/-
3.	వీధి దీపముల రిపేరు, స్విచ్‌బోర్డు ఆపరేటర్ మరియు చేతి పంపుల రిపేరుకు	1 వ్యక్తి సేవలు	ఒక్కొక్కరికి రూ.1000/-

నోట్ : 1 గ్రామపంచాయతీ నిధుల నిల్వలను బట్టి వేతనము చెల్లింపు. 2) టెండర్లు రద్దు చేయుటకు, నిరాకరించుటకు గ్రామపంచాయతీ వారికి అధికారము కలదు. 3) అనుభవము కల వారికి ప్రాధాన్యత ప్రకారం అవకాశము ఇవ్వబడును.

సం॥ శ్రీమతి కొనకాల రాజ్యలక్ష్మి
సర్పంచ్
వల్లూరుపాలెం, తోట్లవల్లూరు మండలం.

సం/- ఓగిరాల తిరుమల వెంకటరత్నం
పంచాయతీ కార్యదర్శి,
వల్లూరుపాలెం, తోట్లవల్లూరు మండలం.

గ్రామ పంచాయతీ కార్యాలయం, పెదపులిపాక

టెండరు ప్రకటన

ఆర్ఒసి నెం.8-2/2022-23 **తేదీ.10-03-2023**

కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం, పెదపులిపాక గ్రామపంచాయతీకి ఈ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా కాంట్రాక్టు పద్ధతిపై పనులు చేయుటకు గాను సీల్డు టెండర్లను తేది : 13-3-2023న ఉదయం 11 గం.లకు పంచాయతీ కార్యదర్శి వారిచే స్వీకరించబడును. సదరు స్వీకరించిన టెండర్లు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో సాయంత్రం 4 గం.లకు తెరువబడును. ఇంకా ఏమైనా విషయాలు తెలుసుకొనుటకు కార్యాలయ పనివేళల యందు అడిగి తెలుసుకొనగలరు.

వ.నెం	పోస్టు వివరములు	ధరావత్తు ఫీజు
1	ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణ పనులు చేయుటకు 19 మంది వ్యక్తులు	రూ.1000
2.	ఎలక్ట్రీషియన్ పనికి -1 (ఒకరు)	రూ.1000

నోట్ : 1 గ్రామపంచాయతీ నిధుల నిల్వలను బట్టి వేతనము చెల్లింపు.
2) టెండర్లు రద్దు చేయుటకు, నిరాకరించుటకు గ్రామపంచాయతీ వారికి అధికారము కలదు.
3) అనుభవము కల వారికి ప్రాధాన్యత ప్రకారం అవకాశము ఇవ్వబడును.

సం/- వేగేశ్న పద్మావతి దేవి,
పంచాయతీ కార్యదర్శి,
పెదపులిపాక గ్రామపంచాయతీ.

గ్రామ పంచాయతి కార్యాలయము - శేరిదగ్గుమిల్లి

టెండరు ప్రకటన

ROC.NO:9/2023 **తేది. 09/03/2023**

కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం శేరిదగ్గుమిల్లి గ్రామ పంచాయతీ నందు ది.1-4-2023 నుండి 31-3-2024 వరకు అనగా ఒక సంవత్సర కాలమునకు యీ దిగువ తెల్పిన షెడ్యూలు దాఖలా పనులను నిర్వహించుటకు కాంట్రాక్టు లేబరు పద్ధతిపై వ్యక్తులను సప్లయ్ చేయుటకుగాను ది. 18-03-2023వ తేదీ శనివారం ఉదయం 11.00 గం.ల నుండి 1.00 గం.ల వరకు గ్రామపంచాయతీ కార్యదరి వారిచేగాని లేదా వారి అనుమతి పొందిన వారిచేగాని సీల్డు టెండర్లు డిపాజిట్లు చెల్లించిన వారి వద్ద నుండి స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 3.00 గంలకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో టెండర్లు తెరువబడును. టెండరు షరతులను మరియు ఇతర వివరములను యీ కార్యాలయం పనిచేయు వేళల యందు తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

వ.నెం.	పనివివరము	పనిచేయు కాలము	చెల్లించవలసిన ధరావత్తు	రిమార్కులు
1.	గ్రామపంచాయతీ ఏరియాలో పారిశుధ్య పనులు నిర్వహించుటకు ఒక వ్యక్తి (స్వీపర్ కం అటెండర్ సప్లయ్ చేయుట)	ది.1-4-2023 నుండి ది.31-3-2024 వరకు	రూ.1000	60 సం॥లోపు వారు మాత్రమే
2.	రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణకు శేరీదగ్గుమిల్లికి ఒక వ్యక్తి సేవలు మాత్రం	ది.1-4-2023 నుండి ది.31-3-2024 వరకు	రూ.1000	60 సం॥లోపు వారు మాత్రమే
3.	రక్షిత మంచినీటి సరఫరా నిర్వహణకు తాడిచర్లకు ఒక వ్యక్తి సేవలు మాత్రం	ది.1-4-2023 నుండి ది.31-3-2024 వరకు	రూ.1000	60 సం॥లోపు వారు మాత్రమే
4.	వీధి దీపముల నిర్వహణ నిమిత్తం ఎలక్ట్రీషియన్‌గా వ్యక్తి సేవలు మాత్రం	ది.1-4-2023 నుండి ది.31-3-2024 వరకు	రూ.1000	60 సం॥లోపు వారు మాత్రమే

గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ప్రభుత్వం వారు నిర్దేశించిన ఎస్.ఎం.ఆర్. రేట్లుకు తగ్గకుండా టెండరు దాఖలు చేయవలెను. అట్లు దాఖలు చేయని టెండర్లు తిరస్కరించబడును. గ్రామపంచాయతీ ఆమోదం పొందిన పిదప శ్రీ కృష్ణాజిల్లా కలెక్టర్ (పంచాయతీ విభాగం) మచిలీపట్నం వారి ఉత్తర్వులు ఇచ్చిన పిదప ప్రతినెల 5వ తేదీలోపు కాంట్రాక్టు సిబ్బందికి (టెండరుదారునకు) సి.ఎఫ్.ఎం.ఎస్. ద్వారా చెల్లించబడును. టెండర్లు వాయిదా వేయుట రద్దుపరచుటకు పంచాయతీ కార్యదర్శి వారికి పూర్తి అధికారము కలదు. మిగిలిన విషయములు కార్యాలయం పనివేళలందు తెలుసుకొనవలెను.

గమనిక :-
1) పైన ఉదహరించిన టెండర్లు తాలూకు దాఖలు చేయువారు సదరు టెండరు ధరావత్తు నగదు రూపములో చెల్లించి రశీదులు పొంది సదరు రశీదును టెండరు షెడ్యూలునకు జతపరిచి టెండరు దాఖలు చేయవలెను. ఈ విషయములో ఎటువంటి మార్పు వుండదని గమనించగలరు.
2) గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి పేమెంట్ చెల్లించబడును.

సం/- పంచాయతీ కార్యదర్శి, ఐ/సి,
గ్రామపంచాయతీ, శేరీదగ్గుమిల్లి.

లబ్ధిదారులకు రుణాలు అందించండి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు అందించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా బ్యాంకర్లను కోరారు. శుక్రవారం ఆయన స్పందన సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమీక్షా సమావేశంలో వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన రుణాల మంజూరు పురోగతిపై బ్యాంకు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకులతో అనుసంధానమైన ప్రభుత్వ పథకాల రుణాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడంలో చొరవ చూపి మంజూరు చేయాలన్నారు. గృహ, వైఎస్సార్ సున్నా వడ్డీ, పంట రుణాలు, జగనన్న తోడు, స్వయం సహాయక సంఘాల రుణాలు, ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం, ముద్రా రుణాలు, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు రుణాలు సకాలంలో మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సుధారాణి, ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ వి.వి.ఫణిరామ్ కుమార్, నాబార్డ్ ఏజీఎం మిలింద్ చౌసాల్కర్, ఎల్డీఎం సాయిరామ్, జిల్లా పరిశ్రమల జీఎం వెంకట్రావ్, డిఆర్ డిఏ పీడీ ప్రసాద్, నగర కమిషనర్ చంద్రయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌భాష

రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయండి : కలెక్టర్

జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్)లను ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్పందన సమావేశపు మందిరంలో ఫార్మేషన్ అండ్ ప్రమోషన్ ఆఫ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గ నైజేషన్స్ ఎఫ్ పీఓఎస్) అంశంపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సభ్యులతో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులు పంటలను పండించటానికి, పండిన పంటను అమ్ముకోవటానికి రైతులకు నాబార్డు, ఎస్ఎఫ్ఏసీ ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈసమావేశంలో నాబార్డ్ డీడీఎం మిలింద్ చౌసాల్కేర్, జిల్లా ఉద్యాన శాఖాధికారిణి జ్యోతి, డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ జ్యోతిరమణి, ఎల్డీఎం సాయిరామ్, పశుసంవర్ధక శాఖాధికారి కె.చంద్రశేఖరరావు, జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఏడీ మణిధర్, డీసీఓ ఫణికుమార్ , మార్కెటింగ్ ఏడీ నిత్యానంద, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'చలో మచిలీపట్నం'ను విజయవంతం చేయండి : జనసేన

ప్రజాశక్తి-అవనిగడ్డ

ఈనెల 14న మచిలీపట్నంలో జరగనున్న జనసేన పార్టీ పదో ఆవిర్భావ దినోత్సవానికి ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రాయపూడి వేణుగోపాలరావు కోరారు. అవనిగడ్డలోని పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అవనిగడ్డ నియోజకవర్గానికి తనను సమన్వయకర్తగా నియమించినందుకు పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర సమన్వయకర్తలు చేగొండి సూర్య ప్రకాష్, సరోజిని అవనిగడ్డకు రానున్నారనీ, నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సమావేశాలు నిర్వహిస్తారని వివరించారు. చలో మచిలీపట్నం గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార నాయకులు లంకె యుగంధర్, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి బాసు నాంచారయ్య నాయుడు, జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, జిల్లా సంయుక్త కార్యదర్శి షరీఫ్, అవనిగడ్డ మండల అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, నాగాయలంక మండల అధ్యక్షులు చింత వెంకటేశ్వరరావు, మోపిదేవి మండల అధ్యక్షులు పుప్పడం రత్న గోపాల్, కోడూరు మండల అధ్యక్షులు మర్రి గంగయ్య, అవనిగడ్డ పట్టణ అధ్యక్షులు రాజనాల వీరబాబు, ఎంపిటిసి సభ్యులు బొప్పన భాను, కటికల వసంత్, యక్కటి నాగరాజు, తుంగల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలపై ప్రజలకు మరింతగా అవగాహన కల్పించటానికి గృహ సారథులు, వాలంటీర్లు కృషిచేయాలని వైసిపి పమిడిముక్కల మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్ కోరారు. పమిడిముక్కల మడలంలోని హనుమంతపురం గ్రామంలో గృహసారథులు, వాలంటీర్లతో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మఒడి, రైతు భరోసా, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకంలో వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం తదితర విషయాలపై లబ్ధిదారులు, ప్రజలకు మరింత లోతుగా అవగాహన కల్పించాలన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలె అనిల్ కుమార్ గడపగడపకు తిరిగి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కలపాల రాంబాబు, కొడమంచిలి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ ఐదో తేదీన జరపతలపెట్టిన చలో ఢిల్లీ కార్మిక, కర్షక, పోరాట ప్రదర్శను జయప్రదం చేయాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం, కౌలు రైతుసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆయా సంఘాల కృష్ణాజిల్లా కమిటీల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ పిలుపును జయప్రదం చేయాలని కోరుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారంనాడు కరపత్రాల పంపిణీని నిర్వహించారు.

చల్లపల్లిలో


ఉంగుటూరులో

చల్లపల్లి : చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల సిఐటియు కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని వెలివోలులో వ్యవసాయ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** ఉయ్యూరు మండలం ముదునూరు, జబర్లపూడి గ్రామాల్లో కరపత్రాలను నాయకులు పంపిణీ చేశారు. సిఐటియు నాయకులు బి.రాజేష్, రైతు సంఘం నాయకులు అన్నే సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం రామచంద్రరావు, కౌలు రైతుల సంఘం నాయకులు పామర్తి చింతయ్య తదితరులు పాల్గొన్నారు. **గన్నవరం(ఉంగుటూరు):** ఉంగుటూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి లావూరి బద్దు, సీతమ్మ నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్మీర వెంకటేశ్వర్‌రావు తదితరులు కరపత్రాలను పంపిణీచేశారు.

ఉయ్యూరులో

ఆశీలు పాట ఆదాయం రూ.8.46 లక్షలు

ఉయ్యూరు: ఉయ్యూరు నగర పంచాయతీ రోజువారీ ఆశీలపాటకు రికార్డుస్థాయిలో రూ.8.46 లక్షల ఆదాయం లభించింది. నగరపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో జంపాన జంగమయ్య రూ.8.46కు ఆశీలు వసూలు చేసుకునే హక్కు దక్కించుకున్నాడు. బహిరంగ వేలంపాటలో జంగమయ్యతో పాటు మరో వ్యక్తి పోటీపడగా అధికార పార్టీ నాయకుల ఎత్తులు చిత్తుచేస్తూ జంగమయ్య వేలం పాట చేజిక్కించుకున్నాడు. గత సంవత్సరం వేలంపాటకు ఎవరు పోటీకి రాకుండా అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి తూతూ మంత్రంగా వేలం పాట పెట్టించి కేవలం రూ.4.05 లక్షలకే చేజిక్కించుకుని ఈసారి కూడా ఆశీలు అడ్డగోలుగా కొట్టేసేందుకు అధికారులతో కలిసి చేసిన పన్నాగం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సంవత్సరం పాటకు గతంలో పాట పాడిన జంగమయ్య గట్టి పోటీనివ్వడంతో అధికార పార్టీకి చెందిన వ్యక్తి పప్పులు ఉడకక పోవడంతో ఉసూరుమంటూ వెళ్లిపోయాడు. ఆశీలపాటకు పట్టణంలో టముకు కూడా వేయించలేదు. వార్డు సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయం నోటీసు బోర్డులో ఉంచలేదు. ప్రకటన తేదీ నుండి బహిరంగ వేలం పాట తేదీకి వారంరోజుల సమయం ఉంటుంది. కేవలం మూడు రోజులు మాత్రమే వ్యవధిలో పాట నిర్వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై నగర పంచాయతీ కార్యాలయ రెవెన్యూ ఉద్యోగిని ప్రశ్నించగా నగరపంచాయతీ నోటీసుబోర్డులో ఉంచామని మిగిలిన చోట్ల అవసరం లేదనీ, ప్రెస్ నోట్ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని బుకాయించడం విశేషం. ఏదేమైనప్పటికీ నగరపంచాయతీకి గత సంవత్సరం కన్నా రూ.4 లక్షలకుపైగా ఈ సంవత్సరం ఆశీలు పాట ద్వారా ఎక్కువ ఆదాయం రావడం పట్ల పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిపై ఆక్రమణల నిరోధానికి చర్యలు : సిఐ

గన్నవరం: గన్నవరం పట్టణంలో లా అండ్ ఆర్డర్ సిఐ కనకారావు, ట్రాఫిక్ సిఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోలీసులు హడావిడి చేశారు. రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. గాంధీ బొమ్మ సెంటర్, వెంకటేశ్వర థియేటర్ సెంటర్ ఏరియాల్లో ఫుట్ పాత్‌లు ఆక్రమించి కోవడంతో జరిగే ప్రమాదాలు, నో పార్కింగ్ పై అవగాహన కల్పించారు. పాద చారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. గన్నవరం సీఐ కనకారావు బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా పట్టణంలో ఆగిరిపల్లి రోడ్డు, దావాజీ గూడెం రోడ్, జాతీయ రహదారిపై సిబ్బందితో తిరుగుతూ హడావిడి చేశారు. లా అండ్ ఆర్డర్ ఎస్ఐలు శ్రీనివాస్, రమేష్‌బాబు, ట్రాఫిక్ ఎస్ఐ మురళీకృష్ణ, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

మచిలీపట్నం నగర పరిధిలో విద్యుత్ వినియోగించే గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.భాస్కరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. 36 బృందాలుగా ఏర్పడి 929 గృహ, 861 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీలు నిర్వహించారు. 66 సర్వీసులకు అదనపులోడు 121 కిలోవాట్ మొత్తానికి రూ.3,17,200 జరిమానా విధించారు. అనుమతించిన కేటగిరీ కాకుండా వేరే విభాగానికి వినియోగిస్తున్న ముగ్గురు వినియోగదారులపై రూ.12 వేలు జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కళ్లజోళ్ల పంపిణీకి టెండర్లు : గీతాబాయి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

జిల్లా అంధత్వ నివారణ సంస్థ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన కళ్లజోళ్ళ కోసం సీల్డ్ టెండర్లను కోరుతున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుండి 14వ తేదీ 5 గంటల వరకు జిల్లా అంధత్వ నివారణ సంఘం అఫ్లికేషన్లు తమ కార్యాలయం నుంచి పొందొచ్చునని పేర్కొన్నారు. టెండర్ల కోసం కనీస రుసుం రూ.1000 జిల్లా అంధత్వ నివారణ సంఘం పేరిట డిడి రూపంలో చెల్లించి దరఖాస్తులను 14న సాయంత్రం 5 గంటల్లోపు అందించాలని కోరారు. 17న ఉదయం 11 గంటలకు జిల్లా సంయుక్త కలెక్టర్ టెండర్లను తెరుస్తారని వివరించారు.

14న నులి పురుగుల నివారణా దినోత్సవం

ప్రజాశక్తి-అవనిగడ్డ

పిల్లలు ఆరోగ్యవంతంగా పెరిగే దానికి ఈ నెల 14న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని అవనిగడ్డ మండలంలో నిర్వహించనున్నట్లు ఆ ప్రోగ్రాం జిల్లా పరిశీలకులు డిటిసిఒ డాక్టర్ కె.వెంకట్రావు తెలిపారు. అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, విద్య, ఐసిడిఎస్ శాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

దళ యాప్ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ

ప్రజా సమస్యలు పరిష్కార మార్గాలు అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవనిగడ్డలో జై భీమ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో దళ యాప్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సముద్రాల అంబేద్కర్ విలేకరులతో మాట్లాడుతూ శనివారం విజయవాడలోని జింఖానా గ్రౌండ్ ప్రాంగణంలో సాయంత్రం నాలుగు గంటలకు ప్రజలందరికీ సత్వర న్యాయం జరగాలని ప్రజా సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకొని జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షులు మాజీ న్యాయమూర్తి జాడ శ్రావణ్ కుమార్ దళ యాప్‌ను ఆవిష్కరిస్తారని చెప్పారు. ఆరిగి లంకేశ్వరరావు, దాసు, గోరుముచ్చు రవి, గోరుముచ్చు బసవయ్య, కర్ర పసి, బడుగు నాని, దాసరి బైరాగి, దాసరి నాగేశ్వరరావు, తోకల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న వెస్ట్ జోన్ ఎసిపి కె.హనుమంతరావు, చిత్రంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ నేతలు

ఎపిడబ్ల్యూజెఎఫ్ డైరీని ఆవిష్కరించిన ఎసిపి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) నూతన సంవత్సరం డైరీ -2023ను శుక్రవారం విజయవాడ వెస్ట్ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఎసిపి) కె.హనుమంతరావు ఆవిష్కరించారు. వన్‌టౌన్లోని ఎసిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర నాయకులు షేక్ ఖాజావలి, విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు కలిమి శ్రీ, ఎం.బి.నాథన్, నగర నాయకులు శేఖర్, బాషా, పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్.నరేంద్రకుమార్, వి.యు.ఫణికుమార్, నాయకులు ఎ.శ్రీనివాస్, పోతిన వాసు, కె.శ్రీనివాసరావు, రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎసిపి హనుమంతరావు మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులకు ఒక విశిష్ట స్థానం ఉందన్నారు. సోషల్ మీడియాలో వార్తలను క్రాస్ చెక్ చేసుకుని ఇస్తే బాగుంటుందని సూచించారు. అలాలేకపోతే ఫేక్ వార్తలు కూడా వైరల్‌గా మారి సమాజానికి తప్పుడు సమాచారం వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఏదైనా వ్యవహారాలకు సంబంధించి వార్తలుగానీ, కథనాలుగానీ సంబంధిత అధికారి వివరణతో ఇస్తే సమగ్రంగా ఉంటుందని పేర్కొన్నారు.

బడి మానేసిన పిల్లల వివరాలు సేకరించండి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: బడి మానేసిన బడిఈడు పిల్లల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి వారం రోజుల్లోపు నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లా వ్యాప్తంగా 5,600 మంది బడిమానిన బడిఈడు పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. వీరిలో 3,700 మంది ఇతర ప్రదేశాలకు వెళ్లడం జరిగిందని, మిగిలిన వారిలో సుమారు 1200 మందికి పైగా తిరిగి బడిలో చేర్పించగా, సుమారు 500 మంది మాత్రమే బడిఈడు పిల్లలు బయట ఉన్నట్లుగా నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. మరొక సారి బడిమానిన పిల్లల పూర్తి సమాచారాన్ని సేకరించి బడిలో చేర్పించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తి పర్యవేక్షణ పెట్టి నిర్ధిష్టమైన నివేదికలను రూపొందించాలన్నారు. అప్‌గ్రేడ్ సమయంలో డ్రాప్ అవుట్ అయిన వారితో పాటు అనంతరం మరికొంతమంది విద్యార్థులు విద్య పట్ల ఆసక్తి లేకపోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు, అనారోగ్యం వంటి కారణాల వలన బడి మానివేసిన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఇవో సివి రేణుక, ఏపిసి జి.మహేశ్వరరావు, డిప్యూటి డిఇవో కె.రవికుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-భవానీపురం: గంజాయితో పట్టుబడిన నలుగురు వ్యక్తులను భవానీపురం పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు భవానీపురం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు స్టేషన్ ఎస్.ఐ లాలం ప్రసాద్ తన సిబ్బందితో గొల్లపూడి ఆంధ్ర హాస్పిటల్ దగ్గర మౌలానగర్ సిమెంట్ రోడ్ పైన్ అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద ఐదు కేజీల 500 గ్రాముల గంజాయి లభించింది. బొడ సందేశ్, పెద్దడీ అశోక్, మాచర్ల గుణ శివశంకర్ కుమార్, సయ్యద్ ఆసిఫ్‌లను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయాలి

కెబిఎన్ కళాశాల కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి-వన్‌టౌన్: విద్యార్థులు తమలోని నైపుణ్యాలను వెలికితీయాలని, అప్పుడే విజయాలను అందుకుంటారని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ప్రాంతీయ స్థాయి క్విజ్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గదులకే పరిమితమైతే అనుకున్న లక్ష్యాలను సాధించలేరన్నారు. తమలోని భావవ్యక్తీకరణ సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అలాగే బృంద చర్చల ద్వారా తమలోని ఆలోచనలకు పదును పెట్టాలన్నారు. అటువంటి నైపుణ్యాలకు క్విజ్, వక్తృత్వ పోటీలు దోహదపడతాయన్నారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా క్విజ్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ పోటీలు పలు స్థాయిల్లో నిర్వహించి విజయవాడ రీజియన్ నుంచి రాష్ట్రస్థాయికి టీమ్‌లను ఎంపిక చేస్తామన్నారు. ఉన్నత విద్యామండలి ప్రతినిధి ఎ.నగేష్‌బాబు మాట్లాడుతూ రాయలసీమ రీజియన్‌కు సంబంధించి తిరుపతిలో, అమరావతి రీజియన్‌కు సంబంధించి విజయవాడలో, విశాఖపట్నం రీజియన్ పోటీలు విశాఖపట్నంలోనూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పూర్వ జిల్లాలైన పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించి కేబీఎన్ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు హేమంత్‌కుమార్, వి.శైలజ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కెబిఎన్ కళాశాల సెక్రటరీ శ్రీనివాసు

ఉపాధ్యాయులపై దాడులు ఆపాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: పాఠశాలల సందర్శన పేరుతో ఉపాధ్యాయులపై దాడులు, సస్పెన్షన్లు ఆపాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య మాట్లాడుతూ పాఠశాలల తనిఖీల పేరుతో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డిఇవోలు, డివైఈవోలు, ఎంఈవోలు, సిఆర్‌పిలు, తదితర సిబ్బంది అందరూ కలసి పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు తప్పులు ఏమైనా ఉంటే వాటిని ఎత్తి చూపుతూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. కొందరికి షోకాజు నోటీసులు, ఛార్జ్‌మెమోలు ఇస్తూ, సస్పెన్షన్లు కూడా చేస్తున్నారని తెలిపారు. దీనితో చాలా మంది ఉపాధ్యాయులు భయపడి స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సిపిఎస్ రద్దు చేయాలని, బకాయిలు చెల్లించాలని, పిఎఫ్ బకాయిలు చెల్లించాలని అప్పుడు మాత్రమే ఉపాధ్యాయులను గౌరవించినట్లుగా భావిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కోశాధికారి కె.సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శులు పులి శ్రీనివాసరావు, కె.గంగరాజు, బి.రెడ్‌స్టార్, డి.హరిప్రసాద్, ఎం.శ్రీనివాసరావు. విజయలక్ష్మి, ఏ.నరసింహారావు, బాలకోటేశ్వరరావు వివిధ మండలాలకు సంబంధించిన నాయకులు పాల్గొన్నారు. అనంతరం డిఇవోకు వినతిపత్రం అందజేశారు.

కౌలు రైతు సంఘం నాయకులు హరికృష్ణ వర్ధంతి

కంకిపాడు: హరికష్ణ లాంటి నాయకులు లేకపోవడం కౌలు రైతు ఉద్యమానికి తీరని లోటని కౌలు రైతు సంఘం కష్ణాజిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. కౌలు రైతు సంఘం కంకిపాడు మండల నాయకులు పరస హరికష్ణ నాలుగో వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి నేతలు పూలదండ వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలపై నిరంతరం కషి చేశారని, కౌలు కార్డులు, రుణాలు తదితర సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.శివశంకరరావు, కె.నాంచారయ్య , శాస్త్రి, టి నరేష్, అబ్దుల్ ఖాన్, పి.నరసింహారావు పాల్గొన్నారు.

'5న చలో ఢిల్లీ'ని విజయవంతం చేయండి

సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్

విస్సన్నపేట : ఏప్రిల్ 5న జరిగే 'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన పార్లమెంట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు. విస్సన్నపేటలోని సుందరయ్య భవనంలో సిఐటియు సమావేశం ఆకల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని, కార్పొరేట్లకు ఉడగం చేస్తున్నారని, కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో నిధులు కోతలు పెడుతున్నారని విమర్శించారు. రైతు సంఘం నాయకులు ఏడుకొండలు మాట్లాడుతూ దేశంలో రైతులు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞానరత్నం, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రమీళ, స్వరూప, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మారేశ్వరి అప్పారావు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో సావిత్రిబాయి వర్ధంతి

విస్సన్నపేట : కెవిపిఎస్, దళిత బహుజన కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి 125 వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞానరత్నం అధ్యక్షత వహించి మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి సావిత్రిబాయి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజనులు కాంతారావు, జయకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, లిబరేషన్ రాష్ట్ర నాయకులు హరినాథ్, కాంగ్రెస్ నాయకులు గుడ్డల రాంబాబు, జై భీమ్ క్షేత్ర నిర్వాహకులు బ్రహ్మం, టాటా ఏస్ వర్కర్స్ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు సుధాకర్, మోహన్‌రావు పాల్గొన్నారు.

కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ పట్టణ పరిధిలో 16వ వార్డు బి సి కాలని నందు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్ జయరాం పర్యటించారు. వీధులలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో వార్డు ఇంచార్జీ ఆచ్చి చినబాబు , సచివాలయ శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాలమ్మ, అంకమ్మతల్లి తిరునాళ్ల

ప్రజాశక్తి-నందిగామ

ముప్పాలమ్మ తల్లి, అంకమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు గత మూడు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి తిరునాళ్లకు విచ్చేసిన నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ లకు ముప్పాళ్ళ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.